ఉష్ణోగ్రత (అంచనా)

12-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	43	27
తెనాలి	42	28
నరసరావుపేట	42	27
బాపట్ల	41	28
రెంటచింతల	42	28
చీరాల	41	28

హాజరుకు.. గంతలు

- ఫోన్‌తో ఏ మార్చి హాజరు
- ఐ-ఎఫ్ఆర్ఎస్ యాప్‌కు గంతలు
- ఆరోగ్య శాఖలో మాయా మశ్చీంద్రలు
- సమయం, స్థలం మార్చి హాజరు నమోదు
- మూడు జిల్లాల్లో 71 మందికిపైగా చర్యలకు రంగం సిద్ధం



కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. పేరుకు ఇద్దరు ఉన్నా ఒక్కరు కూడా సక్రమంగా విధుల్లో ఉండరు. మారుమూల ప్రాంతాల్లో అయితే వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో కూడా ఎవరికీ తెలియడంలేదు.

- జడ్పీ సమావేశాల్లో జడ్పీటీసీల ఫిర్యాదు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో సేవలు సక్రమంగా అందడంలేదు. అత్యవసరంగా వెళ్లినా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండటంలేదు. అడిగితే మీటింగ్‌కు లేదంటే క్యాంపునకు వెళ్లారంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లోని పెద్దాస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది.

- రోగుల ఆవేదన

గుంటూరు సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో ఇదీ పరిస్థితి. వైద్యులు, వైద్య సిబ్బంది కొరత వల్ల ఈ పరిస్థితి అని అనుకుంటే తప్పులో కాలేసినట్లే. అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను అందిపుచ్చుకుని వైద్యులు, వైద్య సిబ్బంది తమకు కావాల్సినప్పుడు విధులకు వచ్చి వెళ్లిపోతున్నారు. కొందరైతే ఆస్పత్రులకు రాకుండా విధుల్లో ఉన్నట్లు హాజరు వేసుకుంటున్నారు. వేళలను పాటిస్తూ తప్పనిసరిగా విధుల్లో ఉంటూ రోగులకు అందుబాటులో వైద్యులు, వైద్య సిబ్బంది ఉండేలా ప్రభుత్వం పక్కాగా హాజరును అమలు చేస్తుండగా.. విధులకు గైర్హాజరయ్యేందుకు పలువురు అడ్డదారులు తొక్కుతున్నారు. పల్నాడు జిల్లాలో పది మంది వైద్యులు, 20 మంది సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, గుంటూరు జిల్లాలో 17 మంది వైద్యులు, ఇద్దరు హెల్త్ ఎడ్యుకేటర్లు, 10 మంది పారామెడికల్ సిబ్బంది, బాపట్ల జిల్లాలో 12 మంది డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బందిపై రాష్ట్ర అధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదులు వెళ్లడం కలకలం రేపుతుంది.

చర్యలు తీసుకున్నా మారరా..

ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై రాష్ట్ర ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 140 మంది సిబ్బందిని శాశ్వతంగా విధుల్లో నుంచి తొలగించారు. వారిలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న డాక్టర్లు కూడా ఉన్నారు. ఒక వైపు ప్రభుత్వం ఇంత సీరియస్‌గా ఉన్నా కొందరు అధికారులు, సిబ్బందిలో ఏ మాత్రం మార్పు రాకపోవడం గమనార్హం.

సెట్టింగ్స్‌లో మార్పులు చేసుకుని..

ఐ-ఫోన్ ఆధారంగా తేదీ, సమయం, ఊరు మార్చి ఎఫ్ఆర్ఎస్(ఫేషియల్ రెకగ్నైజేషన్ సిస్టం) యాప్‌ను పక్కదారి పట్టిస్తున్నారు. ఫోన్‌లో ఉన్న స్టాండర్డ్ సమయం మార్చి ఎప్పుడు హాజరు వేసినా సకాలంలోనే వేసినట్లుగా చూపించేలా సెట్టింగ్స్‌ను మార్చేసుకుని ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను బురిడీ కొట్టిస్తున్నారు. ఉదాహరణకు ఉదయం 9 గంటలకు ఆరోగ్య కేంద్రంలో ఉండాల్సిన ఉద్యోగి ఆ పరిసరాల్లోకి వెళ్లి ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేయాలి. జీపీఎస్‌లో మార్పుల ద్వారా ఇంట్లో ఉన్నా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్నట్లు చూపించవచ్చు. ఉదాహరణకు సాయంత్రం 4 గంటలకు చివరి హాజరు వేసి ఉద్యోగి ఇంటికి బయలుదేరాలి. కానీ ఫోన్‌లో స్టాండర్డ్ సమయం మార్చి సమయాన్ని ముందుకు వెనక్కి మార్చే వెసులుబాటు ద్వారా మధ్యాహ్నం 2 గంటలకే సాయంత్రం 4 గంటల హాజరు కూడా వేస్తున్నట్లు తెలుస్తుంది.

పల్నాడు, గుంటూరు జిల్లాల్లో మరీ దారుణం..

ఎఫ్ఆర్ఎస్ యాప్ విషయంలో ప్రభుత్వం ఎంత సీరియస్‌గా ఉన్నా కొందరు వైద్యుల తీరులో మార్పు రావడం లేదు. ఎఫ్ ఆర్ఎస్ అప్రూవల్ అంతా వైద్యుల చేతుల్లోనే ఉంటుంది కాబట్టి వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కొందరు డాక్టర్లు 104 డ్యూటీకి వెళ్తున్నామని చెప్పి అక్కడ ఒక్క ఫొటో దిగి సిబ్బందికి పని అప్పగించి వెళ్లిపోతున్నట్లు ఆరోపణలున్నాయి. మధ్యాహ్నం తర్వాత చాలామంది వైద్యులు విధుల్లో ఉండటం లేదని ఆరోపణలు ఉన్నా జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రభుత్వానికి ఫిర్యాదు వెళ్లాయి. ఉదాహరణకు పల్నాడు జిల్లా కృష్ణా నది సమీప మండలంలోని ఓ డాక్టర్, ఎంపీహెచ్ఈవో సమయానికి విధులకు హాజరు కాకుండానే హాజరైనట్లు చూపిస్తున్నారని ప్రభుత్వానికి ఇటీవల పలువురు ఫిర్యాదు చేశారు.

సచివాలయం.. గందరగోళం

పాలనను ప్రజలకు దరి చేర్చాలి.. వారి గడప వద్దే ప్రభుత్వ సేవలు అందించాలని గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి.. దానిని ఓ ప్రహసనంగా నడిపింది. పోస్టింగ్‌ల దగ్గర నుంచి పనుల వరకూ అంతా గందరగోళమే. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ప్రక్షాళనకు సిద్ధమవ్వగా.. అదో ప్రహసనంగా మారింది. గత ప్రభుత్వ మార్గదర్శకాల్లో నెలకొన్న అస్పష్టత.. సిబ్బంది సంఖ్యలో లెక్కలు లేకపోవడం.. అసలు ఏ శాఖలో ఎవరు ఉంటున్నారు.. ఎవరు ఎక్కడ పని చేస్తున్నారు. ఎవరు ఏ పని చేస్తున్నారనే విషయంలోనే స్పష్టత లోపించింది. సచివాలయాలను ప్రజాప్రయోజనంగా మార్చడానికే ప్రభుత్వం ఈ రేషనలైజేషన్ నిర్ణయం తీసుకుంది. కానీ క్షేత్రస్థాయిలో అనేక చిక్కుముడులు అలానే ఉన్నాయి. వాటి విషయంలో స్పష్టత ఇవ్వకుండా హడావిడిగా ఈ ప్రక్రియ చేపడితే అది కాస్తా మొక్కుబడి తంతుగా మారి అసలు ఉద్దేశం నీరుకారిపోయే ప్రమాదం ఉంది.

- ప్రహసనాన్ని తలపిస్తున్న క్రమబద్ధీకరణ
- ఇప్పటికే వివిధ విభాగాల్లో సిబ్బంది డిప్యూటేషన్
- గుంటూరులో మిగులు.. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కొరత
- మార్గదర్శకాల్లోనే అస్పష్టత.. కొలిక్కి తెచ్చేందుకు కసరత్తు



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సచివాలయ వ్యవస్థ ఏర్పాటు నుంచి, సిబ్బంది నియామకం వరకు ప్రతి దశలోనూ వైసీపీ ప్రభుత్వం లోపాల పుట్టగా మార్చింది. ఓ ప్రణాళిక లేకుండా సిబ్బంది నియామకాన్ని ఆయా వార్డులు, గ్రామాల అవసరాలను బట్టి కాకుండా మమ అనిపించే విధంగా తంతును పూర్తి చేసింది. ఇక మున్సిపాలిటీ, అంగన్వాడీలు ఇలా పలు విభాగాలకు సమాంతరంగా ఆ వ్యవస్థ పనిచేస్తుండడంతో ఉద్యోగులు ఒకరి మీద ఒకరు ఫిర్యాదు చేసుకునే వరకు పలుసార్లు వెళ్లడం ఆ వ్యవస్థ డొల్లతనానికి సూచికగా నిలిచింది. వాటిని సరిదిద్ది సచివాలయాల క్రమబద్ధీకరణ చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని సర్దుబాటు చేసే ప్రక్రియను చేపట్టింది. అయితే గత ప్రభుత్వం అవలంభించిన అస్తవ్యస్త విధానాలకు తోడు, ప్రస్తుతం జారీ చేసిన మార్గదర్శకాలలో కూడా స్పష్టత లేకపోవడంతో క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రహసనాన్ని తలపిస్తోంది. పలువురు సచివాలయ ఉద్యోగులు ఇప్పటికే డిప్యూటేషన్‌పై వివిధ విభాగాల్లో ఉన్నారు. దీంతో సర్దుబాటు ప్రక్రియ సిబ్బందిని అయోమయంలో నెట్టివేసింది.

అవసరం లేని విభాగాల్లో 2,200 మంది సిబ్బంది...

సచివాలయాలను కొలువుదీర్చినప్పుడు 21 విభాగాలను గుర్తించి.. పోస్టింగ్‌లకు వచ్చేప్పటికి 11 శాఖలకే పరిమితమైంది. ఇక శాఖల వారీగా ఉద్యోగులను సగటున ఒక్కో సచివాలయంలో 9 మందిని నియమించింది. సరే వీరికి విధుల అప్పగింతలో గందరగోళమే నడిచింది. తీర ప్రాంతమే లేని చోట ఫిషరీస్ అసిస్టెంట్‌ను కేటాయించారు. ఇలా అవసరం లేని చోట మూడు జిల్లాల పరిధిలో దాదాపు 2,200 మంది వరకు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం తేల్చింది. సచివాలయాల ఏర్పాటు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జరిగింది. బాపట్ల, పల్నాడు జిల్లాలుగా ఆవిర్భవించినప్పుడు సరిపడా సిబ్బంది లేకపోవడంతో వివిధ విభాగాల అవసరాలకు పలువుర్ని డిప్యూటేషన్ ప్రాతిపదికన నియమించుకున్నారు. వీరిలో అధికశాతం సచివాలయ సిబ్బందే ఉన్నారు.

ప్రస్తుతం చేపడుతున్న సర్దుబాటులో భాగంగా మిగులు సిబ్బందిని క్రమబద్ధీకరణలో భాగంగా కొత్తగా ఏర్పాటయ్యే సచివాలయాల్లో కొలువుదీర్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కానీ గుంటూరు జిల్లాలో సచివాలయ సిబ్బంది అదనంగా ఉండే అవకాశం ఉంది. బాపట్ల, పల్నాడు జిలాల్లో ఆ పరిస్థితి లేదని తెలుస్తోంది. మరోవైపు రేషనలైజేషన్ కసరత్తు జరుగుతుండగానే అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ఎప్పటికకప్పుడు ప్రభుత్వానికి నివేదించేందుకు నియోజక వర్గానికి 5 గురు సచివాలయ సిబ్బందిని కేటాయించాలని ఆదేశాలు రావడంతో మొత్తం ప్రక్రియే గందరగోళాన్ని తలపిస్తోంది.



ఇక పుష్కలంగా తాగునీరు

ఏటీఅగ్రహారం ఓహెచ్‌టీకి హెచ్ఎల్ఆర్ నుంచి పంపింగ్

50/100 హెచ్‌పీ మోటారు అమర్చేందుకు నిర్ణయం

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హైలెవల్ రిజర్వాయర్(హెచ్ఎల్ఆర్)కు శివారు ఓవర్‌హెడ్ ట్యాంకులుగా ఉన్న ఏటీ అగ్రహారం, హౌసింగ్ బోర్డు కాలనీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)ల పరిధిలో తాగునీటి సరఫరా గణనీయంగా మెరుగుపడనుంది. ఇప్పటివరకు హెచ్ఎల్ఆర్ నుంచి గ్రావిటీపై నీటి సరఫరా తొలుత ఏటీ అగ్రహారానికి వస్తుంది. అక్కడి నుంచి పంపింగ్ ద్వారా ఇతర ఓహెచ్‌టీలకు సరఫరా చేస్తున్నారు. హెచ్ఎల్ఆర్‌లో నీటి మట్టం తక్కువగా ఉన్నప్పుడు ఆయా ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గంటల తరబడి పంపింగ్ చేయాల్సి వస్తున్నది. అయినా ఏఎంసీ, హౌసింగ్‌బోర్డు ఓహెచ్‌టీలు పూర్తిస్థాయిలో నిండటం లేదు. ఏటీఅగ్రహారం, హెచ్‌బీకాలనీ, ఏఎంసీ ఓహెచ్‌టీల పరిధిలోని శ్రీరామ్‌నగర్, రామిరెడ్డితోట, నల్లకుంట, హనుమాన్‌నగర్, శ్రీలక్ష్మీనగర్, మహర్షి దయానంద్‌నగర్, హౌసింగ్‌బోర్డుకాలనీ, సీతారామ్‌నగర్ కాలనీల పరిధిలోని శివారు ప్రాంతాలకు సరిగా తాగునీటి సరఫరా జరగడం లేదు. పైగా ఏటీ అగ్రహారం ఓహెచ్‌టీలో ట్యాంకర్లకు నీటిని నింపే పాయింట్ కూడా ఉన్నది. దీంతో వేసవి వస్తే ఎక్కువ సంఖ్యలో ట్యాంకర్లకు నీటిని నింపాల్సిన పరిస్థితి. దాంతో గంటల తరబడి పంపుహౌస్ ఆన్ చేసి పెట్టినా హెచ్‌బీ కాలనీ, ఏఎంసీ ఓహెచ్‌టీలు పూర్తిస్థాయిలో నిండటం లేదు. ఈ సమస్యని అధిగమించేందుకు హెచ్ఎల్ఆర్ నుంచి ఉన్న గ్రావిటీ సిస్టమ్‌ని ఎత్తేసి పంపింగ్ వ్యవస్థని ఏర్పాటు చేయాలని తాజాగా నగరపాలకసంస్థ నిర్ణయించింది. ఇందుకోసం 50/100 హెచ్‌పీ మోటార్‌ని సమకూర్చుకుంటున్నారు. దాని ద్వారా పంపింగ్ చేస్తే త్వరితగతిన ఈ మూడు ట్యాంకులు పూర్తిస్థాయిలో నింపే అవకాశం ఉన్నది. ఓహెచ్‌టీలు నిండితే వాటి పరిధిలోని శివారు ప్రాంతాల్లో కుళాయిలకు పుష్కలంగా తాగునీటి సరఫరా జరుగుతుందని అధికారవర్గాలు తెలిపాయి. ఒకవేళ హెచ్ఎల్ఆర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం వాటిల్లితే పంపింగ్ వాల్వుని కట్టేసి గ్రావిటీ ద్వారా నీటిని ఏటీ అగ్రహారానికి సరఫరా చేసే విధంగా మార్పులు చేస్తున్నట్లు పేర్కొన్నాయి.

అమరావతి ఉద్యమ నేతలకు పెద్దపీట



రాయపాటి శైలజ



ఆలపాటి సురేష్



డాక్టర్ రవి వేమూరి



మల్లె ఈశ్వరరావు

- ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజ
- 'విధ్వంసం' రచయిత ఆలపాటి సురేష్‌కు ప్రెస్ అకాడమీ చైర్మన్
- వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా మల్లె ఈశ్వరరావు
- ఏపీఎన్ఆర్‌టీఎస్ చైర్మన్‌గా తెనాలివాసి డాక్టర్ రవి వేమూరి

గుంటూరు, తూర్పు, తెనాలి, మే 11 (ఆంధ్రజ్యోతి): తాజాగా ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో అమరావతి ఉద్యమ నేతలతో పాటు విధేయ నేతలకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన నలుగురు నేతలను కీలక కార్పొరేషన్ చైర్మన్ పదవులు వరించాయి. అమరావతి జేఏసీ నేతగా గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ రాయపాటి శైలజకు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి, అమరావతి ఉద్యమ నేపథ్యం, గత ఐదేళ్ల అరాచక పాలనపై 'విధ్వంసం' అనే నవలా రచయిత ఆలపాటి సురేష్‌కు ప్రెస్‌అకాడమీ చైర్మన్ పదవి ఇచ్చి వారి సేవలను గుర్తించింది.

● రాయపాటి శైలజ మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు సోదరుడైన గోపాలకృష్ణ (చిన్ని) కుమార్తె. రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్నా ఆమె పెద్దగా రాజకీయాల్లో లేరు. వైసీపీ ప్రభుత్వం తెరమీదకు తెచ్చిన మూడు రాజధానులను వ్యతిరేకిస్తూ శైలజ పోరు బాటతో తెరపైకి వచ్చారు. అమరావతి రక్షణ కోసం ఏర్పాటైన అమరావతి పరిరక్షణ సమితిలో భాగస్వామిగా మారి ఉద్యమాన్ని ముందుండి నడిపారు. 2020 మార్చి 8న చేపట్టిన కనకదుర్గమ్మ ముడుపుల కార్యక్రమంలో ఆమెపై పోలీసులు విరుచుకుపడినా వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత న్యాయస్థానం టూ దేవస్థానం పాదయాత్రలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. 54 రోజులు సాగిన పాదయాత్రలో ఆమె అగ్రభాగాన నిలిచారు. వెయ్యి రోజుల ఉద్యమ నేపథ్యంలో చేపట్టిన మహా పాదయాత్ర-2.0లో కూడా శైలజ కీలకపాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో అమరావతి ఉద్యమంలో ఆమె పోరాటాన్ని గుర్తించిన ప్రభుత్వం ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి ఇచ్చి గౌరవించింది.

● తెనాలికి చెందిన ఆలపాటి సురేశ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమించింది. ఆయన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. టీవీ-9లో ఇన్‌పుట్ ఎడిటర్‌గా పనిచేశారు. జర్నలిస్టు ఉద్యమంలో అత్యంత క్రియాశీలకంగా ఉండే ఆలపాటి సుదీర్ఘకాలం ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆయన రచించిన విధ్వంసం పుస్తకాన్ని ప్రతిపక్ష నేతగా చంద్రబాబు అప్పట్లో ఆవిష్కరించారు.

● గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మల్లె ఈశ్వరరావును వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించింది. టీడీపీ బీసీ విభాగం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఎన్టీఆర్ జిల్లాకో ఆర్డినేటర్‌గా, ఏపీ వడ్డెర సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన ఉన్నారు. దీర్ఘకాలంగా పార్టీకి అందించిన సేవలను గుర్తింపుగా ఈ పదవి ఆయన్ను వరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వడ్డెరల సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

● తెనాలికి చెందిన ఎన్నారై డాక్టర్ రవి వేమూరిని ఏపీ నాన్ రెసిడెన్షియల్ తెలుగు సొసైటీ(ఏపీఎన్ఆర్‌టీఎస్) చైర్మన్ పదవి వరించింది. తెనాలికి చెందిన వేమూరి అభిరామేశ్వరరావు, ఆంధ్రభారతి దంపతుల కుమారుడైన రవి వైద్యరంగంలో విశేష సేవలందిస్తూ అమెరికాలో స్థిరపడ్డారు. 2014 నుంచి 2019 మధ్య కూడా ఆయన ఇదే సొసైటీకి చైర్మన్‌గా పనిచేశారు. ఆ సమయంలో ఆయన చేసిన సేవలకు గుర్తుగానే మరోసారి కూటమి ప్రభుత్వం చైర్మన్ బాధ్యతలను తిరిగి ఆయనకు అప్పగించింది. ప్రవాస తెలుగువ్యవహారాల సలహాదారుడిగా గతంలో రవి పనిచేశారు. రాష్ట్రం ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పెట్టుబడుల అవసరం ఎక్కువగానే ఉందని వీటిని సాధించేందుకు కృషి చేస్తానని రవి తెలిపారు.

సన్‌డే



- పెరిగిన ఎండ తీవ్రత
- రోహిణి కార్తెకు ముందే భగభగ

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎండ.. ఉక్కపోత మధ్య అడపాదడపా ఈదురుగాలులు.. ఆకాశం మేఘావృతం.. వర్షాలతో ఉపశమనం పొందిన ప్రజలు ఆదివారం పెరిగిన ఉష్ణోగ్రతతో అల్లాడిపోయారు. ఆదివారం గుంటూరు, పల్నాడులో జిల్లావ్యాప్తంగా, బాపట్ల జిల్లాలో పలు మండలాల్లో భానుడు భగభగమని మండాడు. రోహిణీ కార్తెకు 15 రోజుల ముందే ఎండ తీవ్రత పెరిగింది. ఆదివారం నుంచి కృతిక కార్తె ప్రారంభం కావడంతో ఆ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఉదయం నుంచే భానుడు భగభగలాడటంతో మధ్యాహ్నం వేళ వాతావరణంలో సెగలుగక్కాయి. గుంటూరు జిల్లాలో ఈ వేసవిలో తొలిసారిగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ని దాటాయి. పల్నాడు జిల్లాలో అచ్చంపేట, కారంపూడి, క్రోసూరు, నరసరావుపేటలో 41 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. నాదెండ్ల, అమరావతి, మాచర్లలో 40 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ప్రత్తిపాడు మండలంలో 36.9 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. సోమవారం నుంచి అన్ని మండలాల్లో 43 డిగ్రీలు, మంగళవారం 44 డిగ్రీల సెల్సియస్‌ని దాటి నమోదవుతాయని పేర్కొన్నది.

మామూళ్ల.. సరఫరా

- టార్గెట్లపై సిబ్బంది గగ్గోలు
- షాపునకు రూ.600, ఎండీయూలకు రూ.1000
- కమీషన్ల మత్తులో పౌరసరఫరాల శాఖ అధికారులు

గుంటూరు, మే 11(ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖలో మామూళ్ల దందా యథేచ్ఛగా సాగుతోంది. కింది స్థాయి నుంచి పై స్థాయి వరకూ అన్ని దశల్లో మామూళ్ల రాజ్యమేలుతున్నాయి. దీంతో పేదల బియ్యం పేదల ఇంటికి చేరకుండానే మాయమైపోతోంది. గుంటూరు రేషన్ మాఫియా ఆట కట్టిస్తానని ముఖ్యమంత్రి స్వయంగా హెచ్చరించినా మాఫియా దందా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమ కేసుల విషయంలో విజిలెన్స్ అధికారులు కూడా ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో మధ్యవర్తుల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా సాగే ఈ వ్యవహారాన్ని కొందరు అధికారులు నేరుగా రంగంలోకి దిగి పూర్తి చేస్తున్నారు. ఎక్కడో మారుమూల ఉండే ప్రాంతాల్లోనే కాదు జిల్లా కేంద్రమైన గుంటూరులోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వారే సరిహద్దులు నిర్ణయిస్తున్నారు. ఆ సరిహద్దులు దాటితే కేసులు నమోదు చేస్తున్నారు. ప్రశ్నిస్తే టార్గెట్ చేసి వ్యక్తిగత స్థాయికి వెళుతున్నారని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు వాపోతున్నారు. గతంలో రేషన్ డీలర్లంతా అసోసియేషన్ ద్వారా పౌర సరఫరాల శాఖ అధికారులకు మామూళ్లు ఇచ్చేవారు. ఇప్పుడు అసోసియేషన్లను పక్కకు పెట్టి అధికారులే ఏకంగా రంగంలోకి దిగి డీలర్లతోనే డీల్ సెట్ చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఒక్కో షాపు నుంచి రూ.600, ఎండీయూ వాహనం నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నారు. గుంటూరులో స్వయంగా డీటీ స్థాయి అధికారులే రంగంలోకి దిగినట్లు ఆరోపణలున్నాయి. నగర పరిధిలోని 220 షాపులు, 90 ఎండీయూల నుంచి ప్రతి నెలా రూ.లక్ష చొప్పున మామూళ్లు అందుతున్నాయని సమాచారం. కాగా మాఫియా డాన్లు ప్రతి నెలా ఒక్కో అధికారికి రూ.50 వేల చొప్పున ఇస్తున్నారని తెలిసింది. దీంతో అధికారులు మాఫియాకు సహకరిస్తున్నారని సమాచారం. విజిలెన్స్ తనిఖీల్లో పట్టుబడినా కేసులు కాకుండా చూసుకోవడానికి వారికీ భారీ మొత్తంలో ముడుపులు చెల్లిస్తున్నారు. ఇదే ఒరవడి జిల్లాలోని అన్ని ప్రాంతాలకూ విస్తరించింది. ఈ వ్యవహారమంతా బాహాటంగా జరుగుతున్నా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. మాఫియాతో వారికి బలమైన సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మాఫియా కూడా వారి పేర్లను ఇష్టారాజ్యంగా వాడుకుంటూ చెలరేగిపోతుంది. ఈ నేపథ్యంలో కొంతమంది బాధితులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

సేవకు ప్రతిరూపం

❖ వైద్య రంగంలో నర్సులది కీలక పాత్ర ❖ నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



సత్తెనపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో కీలక మైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకు వచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజు సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని మే 12న ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా నిర్వహిస్తారు. ప్రజల ఆరోగ్య రక్షణలో నర్సులు అందించే తోడ్పాటును ఈ రోజున గుర్తు చేసుకుంటారు. ప్రజల ఆరో గ్య రక్షణలో నర్సులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయక రోగులకు సేవలు అందిస్తారు. ప్రజల ఆరోగ్యాన్ని మెరుగు ప రచటం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించటం, ఆర్థిక వృద్ధికి మద్దతు వంటి ప్రభావాలను నర్సింగ్ ద్వారా సాధించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. ప్రస్తుతం నర్సులు అంటు వ్యాధులు అనే మహమ్మారితో పోరాడటంలో ముందంజలో ఉన్నారు. వారు నాణ్యత, గౌరవప్రదమైన చికిత్స సంరక్షణను రోగులకు అందిస్తారు. కోవిడ్ మహమ్మారి సమయంలో నర్సులు పోషించిన పాత్ర కీలకం. అందించిన సేవలు ప్రపం చ ప్రజలందరికీ తెలుసు. నర్సులు, ఇతర ఆరోగ్య కార్యకర్తలు లేకుండా సార్వత్రిక ఆరోగ్యాన్ని ఆ దేశాలు సాధించ లేవు. అలాగే నర్సులు ఆరోగ్య కార్యకర్తలందరికీ వృత్తి పరమైన భద్రత, ఆరోగ్యం, ముఖ్యంగా వ్యక్తిగత రక్షణ పరికరాలకు అంతరాయం లేకుండా సురక్షితంగా సంరక్షణతోనే ఉంటేనే రోగులకు సేవలు అందించగలరు. ఆస్పత్రిలో చేరిన రోగులకు వారి శారీరక అవసరాలు నిర్వహించటానికి, ఆరోగ్య పరిస్థితు లకు అనుగుణంగా చికిత్స చేయటానికి నర్సులు ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. నర్సుల దినోత్సవం రోజు నర్సింగ్ విభాగం లో దేశ వ్యాప్తంగా విశేష సేవలు అందించిన నర్సులకు రాష్ట్రపతి, నేషనల్, ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును అందిస్తారు.

నర్సు వృత్తి ఆవిర్భావానికి ప్రతీక.. నైటింగేల్ పుట్టిన రోజు

ఎస్‌కే బంగారు పాప
హెడ్ నర్సు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి



నర్సు వృత్తి ఆవిర్భావానికి వృత్తి గౌరవానికి ప్రతీక ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజు. ఆమె చేసిన త్యాగానికి ఫలితంగా నర్సు వృత్తి అనేది వైద్య రంగానికి వన్నె తెచ్చింది. ప్రపంచంలోని మొత్తం ఆరోగ్య కార్యకర్తల్లో సగానికి పైగా నర్సులు ఉన్నారు. అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా నర్సుల కొరత ఉంది. రోగుల సంరక్షణ, చేసే పని శారీరక, మానసిక సవాలుతో కూడిన వృత్తి.

రోగులకు సేవతో అధిక సంతృప్తి

-ఆదిలక్ష్మి, స్టాఫ్ నర్సు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి



రోగులకు సేవలు అందించటం అధిక సంతృప్తినిస్తుంది. రోగుల సంరక్షణ, సమర్థవంతమైన సేవలను అందిస్తున్నాం. నర్సు వృత్తి నిస్వార్థమైంది. సమాజంలో నర్సులు పోషించే పాత్ర ఎంతో ముఖ్యమైనది.

పుట్టుక నుంచి జీవితాంతం వరకు..

-జ్యోతి, స్టాఫ్ నర్సు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి



వైద్యశాలల్లో పని చేసే నర్సుల పాత్ర మనిషి పుట్టుక నుంచి జీవితాంతం వరకు సంరక్షణ, ప్రత్యక్ష రోగి సంరక్ష ణ, కేసు నిర్వహణ ఉంటుంది. జీవితం లో సమయం, శక్తిలో ఎక్కువ భాగా న్ని రోగుల కోసం కేటాయిస్తాము.

మురళీనాయక్‌ది వీరమరణం

◆ యావత్ దేశం ఆయనను గుర్తించుకుంటుంది ◆ మంత్రి అనగాని

రేపల్లె, మే 11 (ఆంధ్రజ్యోతి): భారత సరిహద్దుల్లో దేశరక్షణకోసం ప్రాణాలు తెగించి పోరాటం చేస్తూ వీరమరణం పొందిన మురళీనాయక్ త్యాగం వృథాగా పోదని రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆదివారం సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్ళితండాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్ భౌతిక



మురళీనాయక్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

కాయం వద్ద మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారా లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మీబిడ్డ దేశం కోసం ధైర్యసాహసాలతో పోరాటం చేస్తూ మృతిచెందటం బాధాకరమైనా దేశం గర్వించదగ్గ సైనికుడిలా నిలిచిపోతారని తెలిపారు. ప్రభుత్వం అన్నివిధాలా మురళీనాయక్ కుటుంబాన్ని ఆదుకుంటుందని ఈ సందర్భంగా హామీనిచ్చారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 513.30 అడుగులు ఉంది. ఇది 137.34 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

● విగ్రహావిష్కరణలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

అమరావతి, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా స్వర్గీయ నందమూరి తారకరామారావు నిలుస్తారని ఎంపీ, టీడీపీ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని ఎండ్రాయి గ్రామంలో నిర్మించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీని ఏర్పాటు చేసి తొమ్మిది నెలల్లో అధికారం చేపట్టిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు గుర్తింపును తీసుకువచ్చి రాజకీయ చైతన్యాన్ని, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ రాజకీయ రంగానికి నూతన ఒరవడి తీసుకువచ్చి డాక్టర్లు, లాయర్లు, అధ్యాపకులను రాజకీయాల్లోకి తీసుకువచ్చి ఆదర్శంగా నిలిచారన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ జాతీయస్థాయిలో తెలుగు వారి సత్తా చాటిన మహానేత ఎన్టీఆర్ అన్నారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు, టీడీపీ నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, పఠాన్ నూర్జహాన్, నూతలపాటి రామారావు, కంచర్ల శివరామయ్య, పార్టీ మండల, గ్రామ అధ్యక్షులు మల్లాది విష్ణు, జాన్‌సైదా, మాజీ సర్పంచ్ జమ్ముల రవికుమార్ తదితరలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

పీఆర్కే.. రాజకీయ సన్యాసం ఎప్పుడు

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, మే 11 (ఆంధ్రజ్యోతి) : నాడు పశర్లపాడు తిరునాళ్లకు వస్తుంటే శాంతిభద్రతల నెపంతో రెంటచింతలలో గంటల కొద్ది నిలిపి వేయించావ్.. మా పార్టీ వాళ్లు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తుంటే అడ్డుతగిలావు. అయినా నేను గ్రామంలోకి వచ్చి ఆలయానికి వెళ్లా.. నన్ను మా పార్టీ నేతలను కార్యకర్తలను ఎంతగా హింసించావో.. జాగ్రత్త.. సినిమా వేరే విధంగా ఉండబోతుంది. వరికపూడిశెల ప్రాజెక్టు తీసుకురాకపోతే రాజకీయ సన్యాసం చేస్తానన్న మాజీ ఎమ్మెల్యే పీఆర్కే రాజకీయాల నుంచి ఎప్పుడు తప్పుకుంటారో స్పష్టం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి డిమాండ్ చేశారు.పశర్లపాడు గ్రామ తిరునాళ్ల సందర్భంగా బ్రహ్మంగారి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం విద్యుత్ ప్రభపై నుంచి ఎమ్మెల్యే ఉద్రేకంగా మాట్లాడారు. మాది మీ లాగా మాట తప్పే వంశం కాదు.. ప్రజల్ని జలగల్లా పీడించలేం.వారి ఉసురుపోసుకోలేం.... కులాల మధ్య మతాల మధ్య చిచ్చుపెట్టలేం..11 నెలల నుంచి మాచర్ల ప్రశాంతంగా ఉంటున్న సమయంలో నీ రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం విభజన రాజకీయాలు చేయొద్దని ఎమ్మెల్యే హితవు పలికారు. మహిళల మంగళహారతులతో నుదుట తిలకం దిద్ది ఎమ్మెల్యేను ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు..ఈ కార్యక్రమంలో మాజీ డీసీ చైర్మన్ నల్లబిరుదు నరసింహారావు, కుర్రి శివారెడ్డి, కావూరి నాగయ్య,దొండపాటి శివనాగు,నాగార్జున,మాజీ సర్పంచ్ వెంకట నారాయణ,సాగు నీటి సంఘ చైర్మన్ హనుమంతరావు,జమ్మిగుంపుల వెంకటేశ్వరరావు,టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి, ప్రభురాజు,నీలం మల్లయ్య,పోట్ల సతీష్,మాధవరావు,అల్లం బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పశర్లపాడు తిరునాళ్ల వేదికపై నుంచి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

సూర్యలంకలో పర్యాటకుల సందడి

బాపట్లరూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వపర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న బాపట్ల సూర్యలంక సముద్రతీరానికి పర్యాటకుల రాక పెరిగింది. వేసవికాలం ఎండల తీవ్రత పెరగటం, ఉక్కపోత ఎక్కువగా ఉండటం వలన ప్రజలు ఉపశమనం కోసం సూర్యలంకకు అధిక సంఖ్యలో ఆదివారం తరలివచ్చారు. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు తీరంకు కారులలో వచ్చి కుటుంబసమేతంగా స్నానాలను చేసి ఆనందంగా గడిపారు. చిన్నారులు తీరం ఒడ్డున ఆడుకున్నారు. యువకులు తీరంలో కేరింతలు కొడుతూ స్నానాలు చేశారు. తీరం సమీపంలోని జీడితోటల కింద వనభోజనాలు చేస్తూ ఆనందంగా గడిపారు. పర్యాటకుల రాకపెరగటంతో రూరల్, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్ళు ముమ్మర గస్తీ నిర్వహించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో తీరం ఒడ్డున వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షలు ముగియటంతో రానున్న రోజుల్లో సూర్యలంకకు మరింతగా పర్యాటకుల రాక పెరిగే అవకాశం ఉంది.



సూర్యలంక తీరంలో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు

కృష్ణానదిలో మునిగి వ్యక్తి మృతి




షేక్ బాజీ (ఫైల్)

కొల్లిపర, మే 11 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిలో స్నానానికి దిగి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివా రం చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకా రం తెనాలి చెంచుపేటకు చెందిన షేక్ బాజీ (25) తన కుటుంబ సభ్యులు పది మందితో కలిసి ఆదివారం సరదాగా కొల్లిపర సమీపంలోని కృష్ణా నదికి వచ్చారు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం షేక్ బాజీ నదిలో ఈత వేయటానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి పోయాడు. కుటుంబ సభ్యులు తహసీల్దార్ సిద్ధార్థకు, ఎస్ఐ కోటేశ్వరరావుకు సమాచారాన్ని అందజేశారు. తహసీల్దార్ సిద్ధార్థ, ఎస్ఐ కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాజీ మృతదేహం లభ్యం కావటంతో ఎస్ఐ కేసునమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడుకి వివాహం అయ్యి రెండు సంవత్సరాలు కావస్తుంది.

పురుగుమందు తాగి వ్యక్తి మృతి

బాపట్లరూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజ్ తెలిపిన వివరాల ప్రకారం వెదుళ్ళపల్లి గవినివారిపాలెం రోడ్డులో కుందేరువాగు సమీపంలోని ప్రహరీగోడ వద్ద ఓ వ్యక్తి మృతదేహం లభ్యమవ్వటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి ఎస్ఐ భాగ్యరాజ్ వెదుళ్ళపల్లి వీఆర్వోతో కలిసి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కనే పురుగుల మందు బాటిల్ ఉన్నది. మృతుడు బాపట్ల మండ లం దరివాద కొత్తపాలెంకు చెందిన భోగిరెడ్డి శేషరెడ్డి (44)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజ్

ఏషియన్ ఉమన్ పవర్ లిఫ్టింగ్‌లో సబీనాకు నాలుగు బంగారు పతకాలు



షేక్ సబీనా

మంగళగిరి, మే 11, (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రా డూన్‌లో జరుగుతున్న ఏషియన్ జూనియర్ ఎక్యూప్డ్ ఉమన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారతదేశం తరఫున పాల్గొన్న తెనాలి వాసి మంగళగిరి ఫిట్ జోన్ జిమ్‌లో అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ కోచ్ షేక్ సంధాని వద్ద శిక్షణ పొందుతున్న సబీనా 84 కేజీల కేటగిరిలో పాల్గొని నాలుగు బంగారు పతకాలు సాధించారని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కే విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని ఆదివారం తెలిపారు. స్కాట్ 190 కేజీలు, బెంచ్ ప్రెస్ 85 కేజీలు, డెడ్ లిఫ్ట్ 180 కేజీలు, ఓవరాల్ 455 కేజీలు బరువులు ఎత్తి నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించిన సబీనాను, కోచ్ సంధానిని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్యన్ వంశీకృష్ణ, సౌత్ ఇండియా, ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, అధ్యక్షులు గంటా వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు మద్ది ప్రభాకర్, మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, గుంటూరు మేయర్ కే రవీంద్ర, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు, పలువురు ప్రముఖులు అభినందించినట్లు తెలిపారు.

'జనరల్ బోగీలు'కు ప్రథమ బహుమతి

పొన్నూరు టౌన్, మే,11 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన 24వ ఉభయ తెలుగురాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటికల పోటీల్లో జనరల్ బోగీలు అనే నాటిక ప్రథమ బహుమతిని అందుకుంది. శనివారం రాత్రి నాటికల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రైలు ప్రమాదాల్లో కుమారుడుని కోల్పోయి, కుమారుడి ఆచూకీ కోసం న్యాయపోరాటం చేసిన మాతృమూర్తి కథాంశంతో సాగిన జనరల్ బోగీలు నాటిక, ఆహూతులతో పాటు న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకుంది. ఈ నాటికకు ప్రథమ బహుమతి లభించగా, దర్శకుడు గోపరాజు విజయ్‌కు బహుమతిని ప్రదానం చేశారు. అసత్యం నాటిక ద్వితీయ బహుమతిని, చిగురుమేఘం నాటిక తృతీయ బహుమతిని అందుకుంది. నాటికల పోటీలను కళాపరిషత్ అధ్యక్షుడు ఎస్ ఆంజనేయులునాయుడు, గౌరవాధ్యక్షుడు ఆకుల సాంబశివరావు పర్యవేక్షించారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న జనరల్ బోగీలు దర్శకుడు గోపరాజు విజయ్

పోలవరం, అమరావతిని పూర్తిచేయడమే సీఎం లక్ష్యం

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): పోలవరం, అమరావతిని పూర్తిచేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కష్టపడుతున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత పాలకుల పాపాలు సరిచేస్తూనే చంద్రబాబు ప్రజల కోసం శ్రమిస్తున్నారన్నారు. మరలా జగనమోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చి ఉంటే ప్రజల ఆస్తులు, భూములు కోల్పోయేవారన్నారు. నెల రోజుల వ్యవధిలోనే కొత్త రేషన్ కార్డులు, అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, పథకాలను కూటమి ప్రభుత్వం ప్రారంభించబోతుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	133, 142, 153
చికెన్ విత్ స్కిన్(కిలో)	254.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	264.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ కె.రవీంద్ర తదితరులు

ఆర్‌వీఆర్ జేసీలో నేషనల్ టెక్నాలజీ డే వేడుకలు

గుంటూరు(విద్య),మే 11(ఆంధ్రజ్యోతి): సాంకేతిక ప్రగతి పైనే, దేశ ఆర్థిక పురోగతి ఆధారపడి ఉందని, సమాజ శ్రేయస్సు దిశగా విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణల ప్రదర్శనను ఆదివారం నిర్వహించారు. డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే తమ కళాశాల విద్యార్థులు అంకుర పరిశ్రమలను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. నిత్యం మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు పరిశోధనలు జరపాలని కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖరరావు, డాక్టర్ కె.శోభ, డాక్టర్ సజ్జా రాధిక, డాక్టర్ కె.ప్రవీణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన నిర్విరామ నృత్య ప్రదర్శన

గుంటూరు(తూర్పు), మే 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వేంకటేశ్వర మందిరం వేదికగా విజయ మాధవి సేవ సాంస్కృతిక అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు విజయ మాధవి కిశోర్ వారి ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు నిర్విరామ నృత్య ప్రదర్శనలతో నిర్వహించిన నేషనల్ లెవెల్ క్లాసికల్ డాన్స్ అండ్ మ్యూజిక్ కార్యక్రమం కళాకారులను అలరించింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథులుగా సినీ నటి రాగిణి, నాగమణి, ప్రత్యేక అతిథిగా టీ.రంజని రెడ్డి, గౌరవ అతిథిగా సీనియర్ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్టు డాక్టర్ రామారావు, హైకోర్టు న్యాయమూర్తి కే.శ్రీనివాసమూర్తి పాల్గొని కళాకారులను సత్కరించారు. నటేశ నర్తన కూచిపూడి కళాక్షేత్రం కళ్ళం శ్రీనివాసరెడ్డి, నృత్య కళాభారతి ఎన్.బాలసుబ్రహ్మణ్యాచారి, అభినయ ఆర్ట్స్ అకాడమీ చింత వెంకట్, సాయి ఈశ్వర్ నృత్య నికేతన్ బి.శారద, శ్రీ అభినయ కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ బ్లాగుబ్బల అనిత, శ్రీ విష్ణు డాన్స్ ఇనిస్టిట్యూట్, సాయి జనని నృత్యానికేతన్ పి.రమాదేవి తదితర కళాకారులు, వారి శిష్యులు అద్భుత నృత్య ప్రదర్శనలు చక్కటి హావభావాలతో ప్రదర్శించి అభిమానులను అలరించారు. సంస్థ వారు నాట్యాచార్యులను కళాకారులను ఘనంగా సత్కరించారు.



కళాకారులతో సినీ నటి రాగిణి తదితరులు

ఘనంగా నరసింహ జయంతి

గుంటూరు (తూర్పు)మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం సాహిత్య సభ నిర్వహించారు. తొలుత ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షుడు విజయబాబు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. నరసింహ జయంతి సందర్భంగా నరసింహ ఆవిర్భావం గురించి భక్త రక్షణకు భగవంతుడే అవతరించిన విధానాన్ని డాక్టర్ జి.వైదేహి వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఘట్టాన్ని వినడం దేశ క్షేమానికి కారకమన్నారు. ముఖ్యఅతిథి డాక్టర్ ఆరెటి కృష్ణకుమారి మాతృ వైభవాన్ని గురించి, తల్లి శిక్షణలో పిల్లలు ఉత్తమ పౌరులుగా రూపొందటం, తల్లి గొప్పతనం గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని కోశాధికారి డాక్టర్ మైలవరపు లలిత కుమారి నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవ్ పెద్ది విజయలక్ష్మి, సామ్రాజ్యం, షేక్ ఖాసింబి తదితరులు పాల్గొన్నారు. జాహ్నవి బృందం భక్తి గీతాలు ఆలపించి ప్రేక్షకులను అలరించారు.



నరసింహ స్వామి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

ఆరు నెలల బకాయిలు విడుదలపై హర్షం

గుంటూరు(తూర్పు), మే 11(ఆంధ్రజ్యోతి) : ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌కి పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల బకాయిల్లో ఆరు నెలల బకాయిలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై ఏపీ ఎంసీప జిల్లా అధ్యక్షురాలు టి.ప్రవళిక హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న నిరసనల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కి, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. వేతన సవరణ, ప్రావిడెంట్ ఫండ్ తదితర అంశాలపై అసోసియేషన్ నాయకులతో త్వరితగతిన చర్చలు జరిపి పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ దీక్షత, జిల్లా నాయకులు జ్యోత్స్న, పావని, అనితరెడ్డి, అబ్బుస్, జహీర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పెన్షనర్‌కు ఇతరులను నామినిగా పెట్టటానికి వీలు కాదు

● ఈదర వీరయ్య

గుంటూరు, మే 11(ఆంధ్రజ్యోతి) : పెన్షనర్‌కు ఫ్యామిలీ ఉండగా వాళ్ళ ఫ్యామిలీ మెంబర్స్ కాకుండా ఇతరులను నామినిగా నియమించరాదని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూల్ 49 ప్రకారం నామినేషన్ దాఖలు చేసిన తరువాత ఉద్యోగి కంటే ముందే నామిని మరణించినా లేక ఉద్యోగి తరువాత రిటైర్మెంట్ గ్రాట్యూనిటి పొందకనే మరణించినా, ఇతర వ్యక్తికి గ్రాట్యూనిటీ చెల్లించవచ్చన్నారు. నామినేషన్ ఇచ్చే సందర్భంలో ఉద్యోగికి ఫ్యామిలి లేకపోతే ఎవరినైనా నామినిగా పేర్కొన్న సందర్భంలో రిటైర్డ్ అయిన తరువాత అతనికి ఫ్యామిలి ఏర్పడితే కొత్తగా ఫ్యామిలీ మెంబర్ చేరితే అప్పుడు అతని పాత నామినేషన్ రద్దువుతుందని తెలిపారు. తన మొదటి నామినేషన్ రద్దు చేయాలని పెన్షన్ మంజూరు అధికారికి నోటీసు పంపితే నోటీసు అధికారికి అందిన రోజు నుండి మొదటి నామినేషన్ రద్దయి అతను సమర్పించిన కొత్త నామినేషన్ అమలులోకి వస్తుందన్నారు. లేక నామిని చనిపోతే కూడా రూల్ -49 ప్రకారం నామినేషన్ రద్దవుతుందని అన్నారు. రిటైర్మెంట్ గ్రాట్యూవిటి ఉద్యోగికి చెల్లిస్తారని తెలిపారు. అతడు దానిని తీసుకోకుండా మరణిస్తే అతను నామినేషన్‌లో తెలిపిన విధంగా చెల్లిస్తారన్నారు. నామినేషన్ సమర్పించకుండానే మరణిస్తే అతనికి రిటైర్మెంట్ గ్రాట్యువిటి, ఇతర బెనిఫిట్స్, భార్య, భర్త/భార్యలు/కుమారులు/కుమార్తెలు వీరికి సమాన షేర్లలో చెల్లిస్తారని తెలిపారు. రిటైర్ అయిన వ్యక్తికి, ఎవరూ లేకపోతే 18 సంవత్సరాల లోపు ఉన్న తమ్ముడికి చెల్లిస్తారు. మొదటి భార్య బతికుండగా ప్రభుత్వ అనుమతి లేకుండా రెండవ భార్యను పెళ్ళాడితే రిటైర్మెంట్ గ్రాట్యూనిటి రెండవ భార్యకు ఇవ్వటం కుదరదని వీరయ్య తెలిపారు.

శ్యామలానగర్ జీరో లైనులో బైక్ రేసులు

● తరచుగా రోడ్డు ప్రమాదాలు
● భయాందోళన చెందుతున్న వాకర్లు



ఇటీవల అభివృద్ధి చేసిన శ్యామలానగర్ జీరో లైను



బైక్‌రేసులు కారణంగా జరుగుతున్న ప్రమాదాలు

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): శ్యామలానగర్ జీరో లైనుని నగరపాలకసంస్థ అభివృద్ధి చేయడంతో బైకర్లకు అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయి. దాంతో గత కొద్ది రోజుల నుంచి ఆకతాయిలు ఇక్కడ బైక్ రేసులు, స్టంట్‌లు చేస్తున్నారు. అసలే ఇరుకు రోడ్డు కావడంతో ఎదురుగా వస్తున్న బైకులు/ కార్లు/ పాదచారులను తప్పించబోయి అదుపుతప్పి కిందపడిపోతున్నారు. దాంతో రోడ్డు ప్రమాదాలు ఇక్కడ నిత్యకృత్యంగా మారాయి. రైల్వేగేటు వరకు ఈ మార్గాన్ని అన్ని వయస్సుల వారు వాకింగ్ కోసం ఉదయం, సాయంత్రం వినియోగిస్తుంటారు. సరిగ్గా అదే సమయంలో ఆకతాయిలు బైక్‌రేసులకు పాల్పడుతుండటంతో ఎక్కడ తమను ఢీకొడతారోనని వారంతా భయాందోళన చెందుతున్నారు. నల్లపాడు రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వహించే ఉద్యోగులే కాకుండా పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు సంస్థల్లో పని చేసే సిబ్బంది, కార్మికులు ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. నిత్యం జరుగుతున్న ప్రమాదాలు, క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్లడానికి అక్కడికి వచ్చే అంబులెన్స్‌లు చూసి ఎక్కడ తాము ప్రమాదానికి గురై కాళ్లు, చేతులు కోల్పోతామోనని భయంగా ప్రయాణించాల్సి వస్తోన్నదని ఈ మార్గాన్ని వినియోగించే ప్రజలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు వాహనాల వేగాన్ని తగ్గించేందుకు వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని నగరపాలకసంస్థ అధికారులను కోరుతున్నారు.

అరండల్‌పేట శివాలయంలో శిఖర గోపుర, కలశ స్థాపన

● నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట 4/4వ లైనులోని శివాలయంలో శ్రీ శరవణభవ సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి వార్ల ఆలయ శిఖర, కలశ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభమౌతుందని అయ్యప్ప సేవా సమాఖ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేసింది. సోమవారం గోపు, గణపతి పూజలు, దీక్షధారణ, వాస్తు హోమం, మంగళవారం మూల మంత్ర జపాలు, హోమం, అధివాసాలు, బలిహరణ, ఊరేగింపు, బుధవారం మూలమంత్ర హోమాలు, శ్రీ విద్యారణ్య భారతీస్వామి చేతుల మీదగా యంత్ర, శిఖర ప్రతిష్ఠ, కలశస్థాపన ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, శాంతి కల్యాణం, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా మాతృ దినోత్సవం

గుంటూరు(తూర్పు), మే 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మాతృ దినోత్సవం ఘనంగా జరిగింది. క్లబ్ అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ మాట్లాడుతూ నేటి యువత, పిల్లలు అమ్మతో ఎలా ప్రవర్తించాలో వివరించారు. ప్రతి రోజు విధిగా అమ్మ ఆశీస్సులు పొందాలని అన్నారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో చందు హనుమాయమ్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్ది శివరాంప్రసాద్, ధర్మకిషోర్, కల్పన, ప్రసన్న, లక్ష్మి, వీర రత్నమ్, శ్రీనివాస్, లంక మాధవి తదితరులు పాల్గొన్నారు.



చందు హనుమాయమ్మను సత్కరిస్తున్న లాఫింగ్ క్లబ్ సభ్యులు

అధిక బరువుతో మోకాళ్ల నొప్పులు

● ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సీతారామ్ ప్రసాద్

గుంటూరు మెడికల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : అధిక బరువుతో పాటు షుగర్, అధిక రక్తపోటు మోకాళ్ల నొప్పులకు దారి తీస్తుందని ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పీ.సీతారామ్ ప్రసాద్ తెలిపారు. బ్రాడీపేటలోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్‌లో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన ప్రసంగించారు. గతంతో పోలిస్తే ప్రస్తుత తరంలో మోకాళ్ల నొప్పుల బాధితులు పెరిగినట్లు డాక్టర్ సీతారామ్ ప్రసాద్ తెలిపారు. విటమిన్ డీ లోపం, శారీరక శ్రమ తగ్గిపోవడం, మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు కూడా అనారోగ్య హేతువులుగా మారుతున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో అధ్యక్షుడు డాక్టర్ టీ.సేవకుమార్, మేనేజర్ పి నిర్మలరాణి, డెంటిస్ట్ డాక్టర్ చల్లా చైతన్య, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్ చైర్మన్ టీ ధనుంజయరెడ్డి, కార్యదర్శి కే.సతీష్, కోశాధికారి టీవీ సాయిరాం, ఎన్.సాంబశివరావు, ఎం.రామారావు, సీహెచ్ శివాజీ, సీహెచ్ లక్ష్మీ సామ్రాజ్యం పాల్గొన్నారు. సభ అనంతరం డాక్టర్ సీతారామ్ ప్రసాద్ ఎముకలు, కీళ్ల నొప్పుల బాధితులను పరీక్షించి తగిన వైద్య సలహాలు అందజేశారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ సీతారామ్ ప్రసాద్

ఘనంగా సీతారామ లక్ష్మణుల విగ్రహ ప్రతిష్ఠ

మంగళగిరి, మే 11(ఆంధ్రజ్యోతి):నగరంలోని కూరగాయల మార్కెట్ సెంటర్ సమీపంలో ఉన్న శ్రీ విఘ్నేశ్వర సుబ్రహ్మణ్య సహిత శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలతో పాటు రాగి యంత్రాలకు బీజాక్షర మంత్రజపం, ప్రాయశ్చిత్త హోమపూజలను నిర్వహించారు.



ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తోన్న పోలీసులు

జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోన్న ఆకస్మిక తనిఖీలు

● అసాంఘిక శక్తుల ఆగడాల అడ్డుకట్టకు చర్యలు

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : భారత్-పాక్ సరిహద్దుల్లో నెలకున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కొద్ది రోజులుగా పోలీసుల ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయి. ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కూడా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, లాడ్జిలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఆకస్మిక తనిఖీలు చేపట్టి అనుమానితులను, ఆయా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పసిగట్టి వాటిని నిరోధించడం, అదే విధంగా పేలుడు పదార్థాలు, గంజాయి, మద్యం, అక్రమ రవాణాను అడ్డుకోవడం వంటి చర్యల్లో భాగంగా ఆయా తనిఖీలు నిర్వహించారు. శాంతి, భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తుల చర్యలను అరికట్టేందుకు ఆయా తనిఖీలు చేపట్టినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులు తమ పోలీస్ బృందాలతో రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, లాడ్జిలు, హోటళ్ళు, వాహనాల్లో తనిఖీలు నిర్వహించి ప్రయాణికులు, అనుమానితుల లగేజీలు, వాహనాలు, ఇతర వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించి, వారి గుర్తింపు కార్డులు, ప్రయాణ గమ్యం, ఉద్దేశ్యం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎక్కడైనా, ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ వారి దృష్టికి తీసుకొచ్చి శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

రౌడీషీటర్లపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదు

● పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు



రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈమేరకు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల కదిలికలపై నిఘా ఉంచామన్నారు. ఎవరైనా సివిల్ వివాదాల్లో తలదూర్చినా, పంచాయతీలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్ల కార్యకలాపాలపై నిఘా ఉంటుందన్నారు. వారంతా స్టేషన్ పరిధిలోని ఇళ్లలోనే నివాసం ఉండాలని, ఇతర ప్రాంతాలకు నివాసం మార్చేస్తే తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆయన హెచ్చరించారు. ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్‌కు హాజరుకావాలన్నారు అదేవిధంగా రౌడీషీటర్ల జీవన విధానం, అదేవిధంగా వారి రోజువారీ కార్యకలాపాలపై సమగ్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పది క్వింటాళ్ళ రేషన్ బియ్యం స్వాధీనం

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మినీ లారీలో తురకపాలెం రోడ్డు నుంచి నగరంపాలెం వైపు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం పట్టాభిపురం పోలీసులు దాడి చేసి లారీని స్వాధీనం చేసుకున్నారు. టీజేపీఎస్ కాలేజీ ముందు ఆపి చెక్ చేయగా అందులో పీడీఎస్ బియ్యానికి వాడే 50 కిలోల బరువు కలిగిన 20 బస్తాల బియ్యం ఉన్నాయి. మొత్తం 10 క్వింటాళ్ళ రేషన్ బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తగు చర్యల నిమిత్తం పట్టాభిపురం పోలీసులు వాహనం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పార్కింగ్‌లుగా పార్కు స్థలాలు

● నగర వాసులకు కరువవుతోన్న ఆహ్లాదం



కావటి శంకరరావు కల్యాణ మండపం పక్కన జీఎంసీ స్థలంలో అనధికారిక పార్కింగ్



రామనామక్షేత్రం ఎదుట రోడ్డులోని జీఎంసీ స్థలంలో అనధికారిక పార్కింగ్

గుంటూరు, మే 11(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా పార్కులు తీర్చిదిద్దాల్సిన ప్రదేశాలు అనధికారిక పార్కింగ్ ప్రదేశాలుగా మారుతున్నాయి. నగరంలో రామనామ క్షేత్రం రోడ్డులో కావటి శంకరరావు కల్యాణ మండపం పక్కనున్న జీఎంసీ పార్కు స్థలం అనధికారిక పార్కింగ్ ప్రదేశంగా మారింది. పరిసర ప్రాంత ప్రజలకు ఆహ్లాదం పంచేలా పార్కుగా తీర్చిదిద్దాల్సిన ఆ ప్రదేశం స్థానికుల వాహనాలకు అనధికారిక పార్కింగ్ ప్రదేశంగా మారింది. సదరు ప్రదేశాన్ని పచ్చని పార్కుగా తీర్చిదిద్దాల్సిన జీఎంసీ యంత్రాంగం నిర్లక్ష్యంగా వదిలేయటంతో నిరుపయోగంగా మారింది. దాంతో స్థానికులు వాహనాలను నిలుపుకుంటూ, వ్యర్థాలను పడేస్తూ అధ్వానంగా తయారు చేస్తున్నారు. అంతేగాక రామనామక్షేత్రం ఎదుటనే ఉన్న మరో జీఎంసీ పార్కు స్థలం కూడా నిరుపయోగంగా మారింది. గతంలో ఇక్కడ పార్కు స్థలాన్ని అందంగా తీర్చిదిద్ది వాకింగ్ ట్రాక్‌గా మార్చారు. కొంతకాలానికి దాని నిర్వహణ గాలికొదిలేయటంతో నిరుపయోగంగా మారింది. దాంతో సదరు స్థలంలో కూడా కార్లు, ఆటోలతో నింపేసి అనధికారిక పార్కింగ్ స్థలంగా మార్చారు.

అంతేగాక అర్ధరాత్రులు పరిసర ప్రాంత యువకులు చేరి మద్యం సేవిస్తూ గలాటా సృష్టిస్తున్నారన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా జీఎంసీ యంత్రాంగం స్పందించి సదరు స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేసి పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక మహిళలు కోరుతున్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం

● రూ.5.50 లక్షల చెక్కు అందించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 11(ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్యంపాలై వైద్యం చేయించుకోలేని వారికి కూడా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ చెప్పారు. కిడ్నీ సమస్యతో బాధపడుతూ విధిలేని పరిస్థితిలో రూ.12 లక్షలు ఖర్చు చేసి వైద్యం చేయించుకున్న గుంటూరులోని వసంతరాయపురానికి చెందిన రాయవరపు లక్ష్మికి ఆదివారం ఆయన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. బాధితురాలి భర్త తాపీ పనులు చేసుకునే వ్యక్తి కావడంతో కుటుంబానికి అది మోయలేని ఆర్థిక భారంగా మారిపోయింది. దీంతో వారు సీఎంఆర్‌ఎఫ్ కోసం ఎమ్మెల్యేను కలవగా ఆయన దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో ఆమెకు రూ.5.50 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ అందింది. ఆ చెక్కును బాధిత కుటుంబం వద్దకు వెళ్లి ఎమ్మెల్యే నసీర్ అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహంకాళి నరసింహారావు, బాబురావు, నాయుడు మధు వేల్పూరి కిరణ్, పఠాన్ మాందా తదితరులు పాల్గొన్నారు.

సజ్జలకు కలక్షన్ ఏజెంట్ శ్రీకాంత్ రెడ్డి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి



మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, మే 11(ఆంధ్రజ్యోతి): చీటింగ్ కేసులో అరెస్టయిన మాజీ మంత్రి విడదల రజిని వ్యక్తిగత సహాయకుడు, వైసీపీ నేత మానుకొండ శ్రీకాంత్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డికి కలెక్షన్ ఏజెంట్ అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు తీవ్ర విమర్శలు చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనేక కేసుల్లో ముద్దాయిగా ఉండి, తప్పించుకొని తిరుగుతున్న నిందితుణ్ణి రజిని తన కారులో ఎక్కించుకొని తిరగటమేకాక, 'దమ్ముంటే అరెస్టు చేయండి చూద్దాం' అని పోలీసులకు సవాల్ విసరటంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ నేత కొలిపాక శ్రీనివాస్‌కు మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇప్పిస్తామని నమ్మబలికి ఆయన వద్ద రూ.50 లక్షలు వసూలు చేయటమే కాక కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్టు ఇప్పిస్తామని వైసీపీ నాయకుడు రత్నారెడ్డి దగ్గర రూ.30 లక్షలు తీసుకున్నమాట వాస్తవం కదా అని ప్రశ్నించారు. యడవల్లి, పసుమర్రు భూములను కాజేయటంతోపాటు బాలాజీ స్టోన్ క్రషర్ యజమానుల వద్ద నుంచి తన మరిది గోపీ, విజిలెన్స్ ఎస్పీ జాషువా చేత బెదిరించి కోట్ల రూపాయలు వసూలు చేసిన మాట వాస్తవం కదా అని నిలదీశారు. నేరాలు చేసి కులాన్ని అడ్డుపెట్టుకొని బతకటం వైసీపీ నేతలకు వెన్నతో పెట్టిన విద్య అని కనపర్తి మండిపడ్డారు. బీసీ నేతలైన సభాపతి అయ్యన్న పాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, కూనా రవి కుమార్ తదితరులను గతంలో అరెస్టు చేసినప్పుడు కులం గుర్తుకు రాలేదా అని కనపర్తి ప్రశ్నించారు. 70 ఏళ్ల రంగనాయకమ్మను, టీడీపీ నేతలు అనిత, కల్యాణిలను ఉన్నపళంగా జైల్లో పెట్టినప్పుడు వారు మహిళలు అన్న విషయం మర్చిపోయారా అంటూ కనపర్తి నిలదీశారు.

దేశం కోసం ఆర్మీ.. జనం కోసం ఆంధ్రా ప్రైమ్

● హాస్పిటల్స్ చైర్మన్ దేగల ప్రభాకర్

గుంటూరు, మే 11(ఆంధ్రజ్యోతి): దేశం కోసం మన ఆర్మీ ఏవిధంగా పని చేస్తుందో, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ అదేవిధంగా పని చేస్తుందని ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. మదర్స్ డే సందర్భంగా ఆదివారం నల్లపాడు జడ్పీ హైస్కూలులో కల్వరి రక్షణ మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో తల్లి ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందని అన్నారు. పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిరంతరం ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండే విధంగా ప్రతి ఆదివారం ఆరోగ్య వారంగా ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తామన్నారు. మహిళలలో వస్తున్న క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి, నిర్మూలించడానికి గ్రేస్ హాస్పిటల్స్ అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ శిబిరంలో, ఆరోగ్యంపై అవగాహనా కల్పించి, మహిళలకు బీఎండీ, ఈసీజీ, రొమ్ము క్యాన్సర్, థైరాయిడ్ పరీక్షలను ఉచితంగా చేశారు. మెగా మెడికల్ క్యాంప్‌లో 180 మంది ప్రజలు పాల్గొని ఉచిత వైద్య సేవలు, మందులు పొందారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అన్వేష్, సాయి రాజశేఖర్, మాధవీలత, గౌరి, శ్రావ్య, క్రిస్టినా, డేనియల్ ఫిన్నీ, సహన శ్రీ, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న దేగల ప్రభాకర్

మూత్రపిండాలను నిర్లక్ష్యం చేయొద్దు

గుంటూరు, మే 11(ఆంధ్రజ్యోతి): మూత్రపిండాల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని డాక్టర్ ఫణిశ్రీ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన ఆరోగ్యసభలో ఆయన ప్రసంగించారు. మన శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపించే అతి ముఖ్యమైన ప్రక్రియ చేసే మూత్రపిండాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో నీటిలో సిలికా అనే భార లోహం కారణంగా ఆయా ప్రాంతాల్లో చాలా మంది ప్రజలు మూత్రపిండ సమస్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాక చాలా కాలం నుంచి మధుమేహంతో బాధపడే వారికి, రక్తపోటు అదుపులో ఉండని వారికి, అధికంగా నొప్పులు మాత్రలు వాడే వారికి, డాక్టర్ సలహా లేకుండా కొన్ని ఆయుర్వేద మందులు వాడే వారు, ప్రోస్టేట్ గ్రంధి వాపు ఉన్న వారికి, వంశపారంపరంగా వచ్చే జీన్స్ వల్ల కూడా మూత్ర పిండ సమస్యలు తలెత్తవచ్చన్నారు. డాక్టర్ మన్నే నిశాంత్ మాట్లాడుతూ మూత్ర పిండ సమస్యలకు గురైన వారిలో కాళ్ళు, మొఖం వాపు రావటం, నీరసం అనిపించటం, ఆకలి, అరుగుదల తక్కువగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, టీవీ సాయిరామ్, రత్నారావు ఉన్నారు.

17న స్టాండప్ కామెడీ షో ప్రదర్శన

గుంటూరు(తూర్పు), మే 11 (ఆంధ్రజ్యోతి): భవన్స్ అకాడమీ ఆఫ్ కల్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో స్థానిక భారతీయ విద్యా భవన్‌లో ఈ నెల 17న ఉదయం 9 గంటల నుంచి స్టాండప్ కామెడీ షో పోటీలను నిర్వహిస్తున్నట్టు భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పి.రామచంద్ర రాజు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేదిక మీద ప్రదర్శకుడు నిలబడి సమాజంలో ఉన్న వివిధ అంశాలను ఎత్తి చూపిస్తూ వ్యంగ్యం, హాస్యభరితమైన తన హావభావాల ద్వారా ఆహుతులను నవ్విస్తూ ఆకట్టుకోవడమే స్టాండప్ కామెడీ షో అని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు భారతీయ విద్యాభవన్ కార్యాలయంలో గాని 9885421496, 8317613187 నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు. ప్రదర్శన వీక్షించే వారికి ప్రవేశం ఉచితమన్నారు.

ఘనంగా సీతారామ లక్ష్మణుల విగ్రహ ప్రతిష్ఠ

మంగళగిరి, మే 11(ఆంధ్రజ్యోతి) : నగరంలోని కూరగాయల మార్కెట్ సెంటర్ సమీపంలో ఉన్న శ్రీవిఘ్నేశ్వర సుబ్రహ్మణ్య సహిత శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం విగ్రహ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అయిదు గంటల సమయంలో శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలతో పాటు రాగి యంత్రాలకు బీజాక్షర మంత్రజపం, ప్రాయశ్చిత్త హోమ పూజలను నిర్వహించారు. ఆ తరువాత నూతనంగా ప్రతిష్ఠించిన విగ్రహాలకు పంచామృత ఫలరస అభిషేక పూజలను చేశారు. అనంతరం శ్రీవిఘ్నేశ్వర సుబ్రహ్మణ్య సహిత సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి దివ్య ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠాపన గావించి పంచలోహ ఉత్సవ విగ్రహాలను కూడాదేవాలయంలో స్థాపించారు. కార్యక్రమంలో శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా కమిటీ ప్రతినిధులందరూ పాల్గొన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం



రహదారిపై పడిన భారీవృక్షం

తాడేపల్లి టౌన్, మే 11, (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలో కృష్ణుడి గుడి సమీపంలో సచివాలయం ఎదురుగా ఉన్న ఓ భారీ వృక్షం ఆదివారం సాయంత్రం నేలకూలింది. ఆ సమయంలో రోడ్డుపై ట్రాఫిక్ లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎంటీఎంసీ అధికారులు పడిపోయిన చెట్టును తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

17న స్టాండప్ కామెడీ షో

గుంటూరు(తూర్పు), మే 11 (ఆంధ్రజ్యోతి): భవన్స్ అకాడమీ ఆఫ్ కల్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో స్థానిక భారతీయ విద్యాభవన్‌లో ఈ నెల 17న ఉదయం 9 గంటల నుంచి స్టాండప్ కామెడీ షో పోటీలను నిర్వహిస్తున్నట్లు భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేదిక మీద ప్రదర్శకుడు నిలబడి సమాజంలో ఉన్న వివిధ అంశాలను ఎత్తి చూపిస్తూ వ్యంగ్యం, హాస్య భరితమైన తన హావభావాల ద్వారా ఆహుతులను నవ్విస్తూ ఆకట్టు కోవడమే స్టాండప్ కామెడీ షో అని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు భారతీయ విద్యాభవన్ కార్యాలయంలో గాని 9885421496, 8317613187 నెంబర్‌లలో సం ప్రదించాలని సూచించారు. ప్రదర్శన వీక్షించే వారికి ప్రవేశం ఉచితమన్నారు.

ఆరు నెలల బకాయిలు విడుదలపై హర్షం

గుంటూరు(తూర్పు), మే 11 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌కి పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల బకాయిల్లో ఆరు నెలల బకాయిలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై ఏపీ ఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు టి.ప్రవళిక హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న నిరసనల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కి, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. వేతన సవరణ, ప్రావిడెంట్ ఫండ్ తదితర అంశాలపై అసోసియేషన్ నాయకులతో త్వరగా చర్చలు జరిపి పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ దీక్షత, జిల్లా నాయకులు జ్యోత్స్న, పావని, అనితరెడ్డి, అబ్బుస్, జహీర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పది క్వింటాళ్ల రేషన్ స్వాధీనం

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మినీ లారీలో తురకపాలెం రోడ్డు నుంచి నగరంపాలెం వైపు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం పట్టాభిపురం పోలీసులు దాడి చేసి లారీని స్వాధీనం చేసుకున్నారు. టీజేపీఎస్ కాలేజీ ముందు ఆపి చెక్ చేయగా అందులో పీడీఎస్ బియ్యం 50 కిలోల బరువు కలిగిన 20 బస్తాలు ఉన్నాయి. మొత్తం 10 క్వింటాళ్ళ రేషన్ బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పట్టాభిపురం పోలీసులు వాహనం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అరండల్‌పేట శివాలయంలో శిఖర గోపుర, కలశ స్థాపన మహోత్సవం

● నేటి నుంచి మూడు రోజులు

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట 4/4వ లైనులోని శివాలయంలో శ్రీ శరవణభవ సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి వార్ల ఆలయ శిఖర, కలశ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభమౌతుందని అయ్యప్ప సేవా సమాఖ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేసింది. సోమవారం గోపు, గణపతి పూజలు, దీక్షధారణ, వాస్తు హోమం, మంగళవారం మూల మంత్ర జపాలు, హోమం, ఆదివాసాలు, బలిహరణ, ఊరేగింపు, బుధవారం మూలమంత్ర హోమాలు, శ్రీ విద్యారణ్య భారతీస్వామి చేతుల మీదగా యంత్ర, శిఖర ప్రతిష్ఠ, కలశస్థాపన ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, శాంతి కల్యాణం, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతా యని తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మూత్రపిండాలను నిర్లక్ష్యం చేయొద్దు

గుంటూరు, మే 11(ఆంధ్రజ్యోతి): మూత్రపిండాల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యంల చేయ కూడదని డాక్టర్ ఫణిశ్రీ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన ఆరోగ్యసభలో ఆయన ప్రసంగిస్తూ పలు సూచనలు చేశారు.

చలివేంద్రాల ఏర్పాటు లేనట్లేనా..?

● చలివేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం
● కనిపించని దాతల చలివేంద్రాలు
● దాహార్తితో అల్లాడుతున్న ప్రజలు

తాడికొండ, మే 11(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం వచ్చి రెండు నెలలు గడుస్తున్న చలివేంద్రాలు లేక ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నారు. వేసవి కాలంలో మే నెలలో ఎండ తీవ్రత రోజు రోజుకు పెరుగుతుంది. దాహార్తితో ప్రజలు ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం నుంచి ఒక్క చలివేంద్రం ఏర్పాటు చేసిన దాఖలాలు కన్పించటం లేదు. అంతేకాకుండా దాతలు కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో ప్రజలు నీళ్ల కోసం కూల్‌డ్రింగ్స్ షాపులకు పరుగులు తీయాల్సి వస్తుంది. తాడికొండలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. తహసీల్దార్, మండల ప్రజాపరిషత్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, డీఆర్ డీఏ వెలుగు, ఎన్‌ఆర్‌జీఎస్, విద్యుత్‌శాఖ, ఎంతోవో కార్యాల యాలు ఉన్నాయి. మండలపరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు నిత్యం పనుల కోసం తాడికొండ గ్రామానికి రావాల్సి ఉంటుం ది. అలాగే ఏపీ గురుకుల పాఠశాల, అంబేద్కర్ బాలయోగి గురుకుల పాఠశాల, ఇంటర్,



తాడికొండలో దాతలు ఏర్పాటు చేసిన చలివేంద్రం

డిగ్రీ కళాశాలలు, సంస్కృత కళాశాల్లో చేరే విద్యార్థులు తాడికొండకు దూర ప్రాంత్రాల నుంచి వస్తుంటారు. అంతేకాకుండా రేషన్ బియ్యం ఎంఎల్ పాయింట్ కూడా తాడికొండలో ఉండటం వల్ల తాడికొండ, తుళ్లూరు మండలాల రేషన్ డీలర్లు వస్తుంటారు. గ్రామీణ రూరల్ హెల్త్ సెంటర్లో వైద్యం నిమిత్తం రోగులు వస్తుంటారు. దీంతో ప్రతి నిత్యం వేలాది మంది తాడికొండకు వివిధ పనుల నిమిత్తం వచ్చిపోతుంటారు. పెరిగిన ఎండలకు ప్రజలు, విద్యార్థులు, దాహార్తితో అలమటిస్తున్నారు. చలివేంద్రాలు లేకపోవటంతో దాహార్తిని తీర్చుకోవటానికి నీటిని కొనుగోలు చేస్తున్నారు. పేదలు మంచి నీటిని కొనుగోలు చేయలేక చలివేంద్రాలకు ఎదురు చూస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీటి సౌకర్యాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి ప్రజలు దాహార్తి తీర్చితే బాగుటుందని వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చిన వారు వాపోతున్నారు. అయితే గతంలో దాతలు వేసవి కాలంలో చలి వేంద్రాలను ఏర్పాటు చేయటంలో ముందుండే వారు. కాని ఈ సంవత్సరం దాతలు కూడా చలి వేంద్రాలను ఆయా గ్రామాల్లో, ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వం స్పందించి చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

ఎట్టకేలకు ఈమని రోడ్డు నిర్మాణం పనులకు శ్రీకారం

● హామీని నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్

దుగ్గిరాల, మే 11 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల నుంచి ఈమని వరకూ గల ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం పనులకు ఆదివారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఒకటిన్నర దశాబ్దకాలంగా రోడ్డు నిర్మాణం చేపట్టక పోవడంతో గుంతలమయమైన రోడ్డుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. ఎన్నికల ప్రచారంలో మంత్రి నారా లోకేశ్ యిచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, రోడ్డు నిర్మాణం పనులు చేపట్టడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దుగ్గిరాల పాతలాకు నుంచి ఈమని గ్రామశివారులోని పాత పంచాయతీ సమితి కార్యాలయం వరకూ 4కి.మీ బీటీ రోడ్డును రూ.2.86 లక్షలతో నిర్మించనున్నారు. రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసిన టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దినెలల కాలంలోనే మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో నందివెలుగు నుంచి రేవేంద్రపాడు వరకూ 14కి.మీ మేర రోడ్డు నిర్మాణం పనులు పూర్తిచేసి వాహనదారులు వెతలు తీర్చారని అన్నారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు త్వరగా చేపడుతూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. ఎంపీపీ జబీన్ మాట్లాడుతూ అభివృద్ధికి చిరునామాగా మంగళగిరిని దేశంలోనే గొప్ప నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్న నారా లోకేశ్‌కు మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత మాట్లాడుతూ నారా లోకేశ్ దుగ్గిరాల



రోడ్డు పనులకు శంకుస్థాపనలో పాల్గొన్న టీడీపీ నేతలు పోతినేని, శ్రీఅనిత, ఎంపీపీ జబీన్ తదితరులు

మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధికి సహకారం అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. వాణిజ్యవిభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, జనసేన అధ్యక్షుడు మండల పసుపులేటి శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయి చైతన్య, సర్పంచ్ సిద్దెల ఉజ్వల హరిణి, మాజీ ఎంపీపీలు వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, ఉన్నం ఝాన్సీరాణి, పోలిమెట్ల రత్నగిరిరావు, యడ్ల సాయికృష్ణ, కాసరనేని కృష్ణ, కాకోతు దేవదాసు, అంచే మారుతీ వరప్రసాద్, అంచే రవిచంద్, సంకా మూర్తి, తుమ్మపూడి ప్రసాద్, ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఏఈ నరసింహారావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రేమిస్తున్నానంటూ ఇంటికి వచ్చి దౌర్జన్యం

● పోలీసులకు తల్లి ఫిర్యాదు

దుగ్గిరాల, మే 11(ఆంధ్రజ్యోతి): యువతిని ప్రేమిస్తున్నానంటూ, ఆమె ఇంటికి వెళ్లి దౌర్జన్యానికి పాల్పడినట్లు యువతి తల్లి యిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే ఈమనికి చెందిన ఎం అభిషేక్, అతని స్నేహితుడు భార్గవ్‌తో కలిసి అదే గ్రామానికి చెందిన ఓ యువతి ఇంటికి వెళ్లి వారి కుమార్తెను ప్రేమిస్తున్నానని, బయటికి పంపాలని చెప్తూ గేట్లను తంతూ గొడవపెట్టుకుని దౌర్జన్యానికి పాల్పడ్డాడు. యువతి తల్లి నివేదిత యిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ వెంకటరవి తెలిపారు.

నిర్విరామ నృత్య ప్రదర్శన

గుంటూరు(తూర్పు), మే 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వేంకటేశ్వర మందిరం వేదికగా విజయ మాధవి సేవ సాంస్కృతిక అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు విజయ మాధవి కిశోర్ వారి ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు నిర్విరామ నృత్య ప్రదర్శనలతో నిర్వహించిన నేషనల్ లెవెల్ క్లాసికల్ డాన్స్ అండ్ మ్యూజిక్ కార్యక్రమం కళాకారులను అలరించింది. ముఖ్యఅతిథులుగా సినీ నటి రాగిణి, నాగమణి, ప్రత్యేక అతిథిగా టీ.రంజనిరెడ్డి పాల్గొన్నారు.

రాజధాని గ్రామాల్లో కార్మికుల సందడి

తుళ్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణ పనులు చేయటానికి ఆయా కంపెనీలు కార్మికులను వివిధ రాష్ట్రాల నుంచి రంగంలోకి దించుతున్నాయి. ఆదివారం సెలవు దినం కావటంతో రాజధాని గ్రామాల్లో కార్మికుల సందడి కనిపించింది. కూరగాయల మార్కెట్, నిత్యావసర సరుకుల దుకాణాలు, ఫ్యాన్సీ షాపులు, మందుల దుకాణాలు వద్ద కార్మికుల రద్దీ కనబడింది. గత టీడీపీ ప్రభుత్వం రాజధాని నిర్మాణ పనులు చేయటానికి చత్తీస్‌ఘడ్, ఒరిస్సా, ఉత్తర ప్రదేశ్, బీహార్, తమిళనాడు తదిర రాష్ట్రాల నుంచి నిర్మాణ కంపెనీలు దాదాపు 45 వేల మంది కార్మికులతో పనులు నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్మాణ కంపెనీలను పారద్రోలింది. దీంతో కార్మికులు



కార్మికులతో సందడిగా తుళ్లూరులోని లైబ్రరీ సెంటర్

వారి స్వస్థలాలకు వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజధాని పనులు ఊపందుకున్నాయి. ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదగా పనులు పునఃప్రారంభానికి శంకుస్థాపన జరిగింది. ఏజన్సీ కంపెనీలు భారీ సంఖ్యలో కార్మికులను దించుతున్నారు. వారు ఉండటానికి సకల సదుపాయాలతో షెడ్లు నిర్మిస్తున్నారు.

కులాల మధ్య చిచ్చుపెడుతున్న వైసీపీ నాయకులు

తాడికొండ(కంతేరు), మే 11 (ఆంధ్రజ్యోతి): కంతేరులో వైసీపీ నాయకులు కులాల మధ్య చిచ్చు పెడుతు గ్రామంలో గొడవలు సృష్టిస్తున్నారని టీడీపీ గ్రామ అధ్యక్షుడు కర్రిపాల్ బాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం కంతేరు గ్రామంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాల్ బాబు మాట్లాడుతూ పాఠశాలల్లో చిన్న పిల్లల మధ్య జరిగిన చిన్న తగాదాను కాపు కులస్తులకు చుట్టి వారి ఇంటిపై దాడులు చేసి, ఇళ్లలోని వస్తువులను ధ్వంసం చేశారన్నారు. అంతేకాకుండా దాడులకు పాల్పడిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సకాలంలో స్పందించిన పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఇళ్లపై దాడిచేసిన కేసులో వైసీపీ ఎంపీటీసీ వలపర్ల కల్పనను పోలీసులు అరెస్టు చేస్తే, దానిని వక్రీకరిస్తు వైసీపీ సోషల్ మీడియా భారత్, పాకిస్తాన్‌ల యుద్ధంపై తప్పుడు పోస్టులు పెడితే అరెస్టు చేశారని వక్రీకరించారు. బాధితులు ఇళ్లపై 10మందిపై కేసులు పెడితే నలుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టు హాజరుపరచగా వారికి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందన్నారు. అయితే వైసీపీ పత్రిక టీడీపీ నాయకులపై తప్పుడు కథనాలు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ బుల్లా విజయరావు, టీడీపీ నాయకులు దారా సుందరరావు, పట్నం మరియదాసు, మల్లవరపు ఇమ్మానియేలు, నాగభూషణం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కంతేరు టీడీపీ నాయకులు

జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోన్న ఆకస్మిక తనిఖీలు

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : భారత్ - పాక్ సరిహద్దుల్లో నెలకున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కొద్ది రోజులుగా పోలీసుల ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయి. ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కూడా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్లు, బస్ స్టాండ్లు, లాడ్జిలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీస్ అధికారు లు, సిబ్బంది ప్రత్యేక ఆకస్మిక తనిఖీలు చేపట్టి అనుమానితులను, ఆయా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పసిగట్టి వాటిని నిరోధించడం, అదేవిధంగా పేలుడు పదార్థాలు, గంజాయి, మద్యం, అక్రమ రవాణాను అడ్డుకోవడం వంటి చర్యల్లో భాగంగా ఆయా తనిఖీలు నిర్వహించారు. శాంతి, భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తుల చర్యలను అరికట్టేందుకు ఆయా తనిఖీలు చేపట్టినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులు తమ పోలీస్ బృందాలతో రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, లాడ్జిలు, హోటళ్ళు, వాహనాల్లో తనిఖీలు నిర్వహించి ప్రయాణికులు, అనుమానితుల లగేజీలు, వాహనాలు, ఇతర వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించి, వారి గుర్తింపు కార్డులు, ప్రయాణ గమ్యం, ఉద్దేశ్యం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎక్కడైనా, ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ వారి దృష్టికి తీసుకొచ్చి శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ వారికి సహకరించాలని ఎస్పీ సూచించారు.



ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తోన్న పోలీసులు

రెండోరోజు టీఆర్ఏ క్రికెట్ పోటీలు

దుగ్గిరాల, మే 11(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల, కంభంపాటి నారాయణ జూనియర్ కళాశాలల క్రీడాప్రాంగణంలో ప్రారంభమైన తారకరామా అసోసియేషన్ క్రికెట్ పోటీల్లో మొదటి రోజు నాలుగు మ్యాచ్‌లు నిర్వహించగా, రెండోరోజు ఆదివారం ఐదు మ్యాచ్‌లు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు ప్రతి మ్యాచ్‌లో ఒకరికి ప్రోత్సాహకంగా మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ పురస్కారం అందించారు. రెండు మ్యాచ్‌లు హోరా, హోరీగా ఉత్కంఠ భరితంగా కొనసాగాయి. అత్తోట మణిమెర్సీ జట్టు, గుంటూరు పవన్ ఫ్రెండ్స్ సర్కిల్ మధ్య జరిగిన మ్యాచ్‌లో మణి మెర్సీ జట్టు 14పరుగుల ఆధిక్యతతో విజయం సాధించింది. దుగ్గిరాల జోష్ టీమ్, తెలప్రోలు జోష్ టీమ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో తెలప్రో లు టీమ్ ఒక్కపరుగు ఆధిక్యతతో విజయం సాధించింది. దుగ్గిరాల సమీర్ ఎలెవెన్ రైల్వే ఎలెవెన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సమీర్ ఎలెవెన్ జట్టు 8వికెట్ల తేడాతో విజయం సాధించింది. టీఆర్ఏ టోర్నీ నిర్వాహక కమిటీ సభ్యులు వల్లూరు నరసింహారావు, పర్వతనేని హర్ష తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా శ్రీనాగేశ్వరస్వామి గ్రామోత్సవం

దుగ్గిరాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : దుగ్గిరాలలోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీనాగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు మూడోరోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు నాగేశ్వరం యుగంధరశర్మ నేతృత్వంలో ఉదయం గం.6.30ని.లకు నిత్యహోమానంతరం గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం గం.7.30ని.లకు దంపతులు వాసిరెడ్డి సుధాకర్, పద్మలతో పూజాకార్యక్రమాల అనంతరం అత్యంత వైభవంగా రథోత్సవం నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి శ్రీనివాసవర్మ పర్యవేక్షణలో రథోత్సవానంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.



గ్రామోత్సవం, మండపంవద్ద పూజాకార్యక్రమంలో పాల్గొన్న దంపతులు,

వధూవరులకు పెళ్లికానుక అందజేత



పెళ్లికానుక అందిస్తున్న కొల్లి శేషు తదితరులు

తాడేపల్లి (పెనుమాక), మే 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో వలితోటి మార్తమ్మ కుమారుడి వివాహానికి హాజరై వధూవరులు రాజశ్రీ - రాజ్‌కుమార్‌లకు మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుక, మంగళసూత్రాన్ని అందజేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, పఠాన్ జానీఖాన్, స్థానిక నేతలు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

స్వామికి సుగంధ ద్రవ్యాలతో అభ్యంగన స్నానాలు

వట్టిచెరుకూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లేమల్లెపాడులో ఉన్న వరాల సుబ్రహ్మణ్యమణ్యేశ్వర స్వామి దేవస్థానం ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామికి సుగంధ ద్రవ్యాలతో అభ్యంగన స్నానం, పెళ్ళి కుమారుడిని చేసే కార్యక్రమంలో మహిళలు పసుపు నీరు తీసుకు వచ్చి ప్రత్యక్షంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రికి గ్రామప్రభ ఊరేగింపు నిర్వహించారు. సోమవారం ఉదయం కలశ పూజ, స్వామి కల్యాణం, శాంతి పూజలు, తెప్పోత్సవం, పవళింపు సేవతో ఆరాధన మహోత్సవాలు ముగుస్తాయని ఆలయ చైర్మన్ రాఘవ వెల్లడించారు.

టిడ్కో గృహవాసులకు తీరనున్న మంచినీటి కష్టాలు



పైపులైను ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న టీడీపీ నేత పోతినేని శ్రీనివాస్

తాడేపల్లి టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): గతంలో సీఎం చంద్రబాబు పెనుమాక పర్యటనలో భాగంగా టిడ్కో గృహవాసులు పడుతున్న మంచినీటి ఇబ్బందులు ఆయన దృష్టికి తీసుకురావడంతో పైపులైను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అమృత్-2 నిధులు రూ.5కోట్లతో ఆదివారం నులకపేట గుంటూరు ఛానల్ వద్ద ప్రధాన కృష్ణానది మంచినీటి పైపులైను నుంచి పనులు ప్రారంభం సందర్భంగా టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు భూమిపూజ నిర్వహించారు. పెనుమాక కృష్ణాయపాలెం పరిధిలోని టిడ్కో గృహాలకు 6.5 కిలోమీటర్ల మేర పైపులైన్లు ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో రాజధాని పరిధిలోని టిడ్కో గృహవాసులకు మంచినీటి కష్టాలు తీరనున్నాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పోతినేని శ్రీనివాస్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గాన్ని మంత్రి లోకేశ్ చొరవ తీసుకుని అభివృద్ధి పథంలోకి పయనింపజేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, రాష్ట్ర పద్మశాలీయ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

తల్లి రుణం తీర్చుకోలేనిది : సీఐ వినోద్

మంగళగిరి, మే 11 (ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన తల్లి రుణం తీర్చుకోలేనిదని పట్టణ సీఐ వినోద్‌కుమార్ అన్నారు. నగరంలోని ఎన్ఎస్ఆర్ విల్లాస్‌లో ఆదివారం ఉదయం నిర్వహించిన మదర్స్‌డే వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. తొలుత ఆయన కేక్ కట్‌చేసి కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మహిళలకు కేక్‌ను పంచిపెట్టి మదర్స్‌డే శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ నవమాసాలు మోసి కనిపెంచిన తల్లి తన బిడ్డలను పెంచి పెద్దచేసే విషయంలో ఎన్నో బాధలకు గురవుతుందన్నారు. తల్లులు తమతమ పిల్లలను ఉన్నతమైన వ్యక్తిత్వంతో పెంచి వారిని మంచి పౌరులనుగా తీర్చిదిద్దాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీమంత్రి మురుగుడు హనుమంతరావు, మంచాల సాయి సుధాకర్ నాయుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సుంకర రఘుపతిరావు, బీవీఎస్ ఇన్‌ఫ్రా అండ్ డెవలపర్స్ చైర్మన్ ఇంటూరి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేసి తల్లులకు ఇస్తున్న సీఐ వినోద్‌కుమార్

వీర జవాన్‌లకు రాజధాని రైతుల నివాళి



జై జవాన్ అంటూ తుళ్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, మహిళలు

తుళ్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): జై జవాన్.. జయహో భారత్.. అంటూ రాజధాని రైతులు, మహిళలు తుళ్లూరులో ఆదివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. వీర మరణం పొందిన జవాన్‌లకు నివాళి అర్పించారు. ఉగ్రవాదులను తరిమి కొట్టాలంటూ నినాదాలు చేశారు. వీర మరణం పొందిన తెలుగు తేజం మురళీ నాయక్ జోహార్.. అంటూ నినాదాలు చేశారు. జాతీయ జెండాలు చేతపట్టుకొని ప్రదర్శన చేశారు. పాకిస్తాన్ డౌన్, డౌన్ అంటూ నినాదాలు హోరెత్తాయి. ఎదురుగా వచ్చే ధైర్యం లేక చాటుగా వచ్చి అమాయకుల ప్రాణాలు తీసారని, ఇది పిరికిపంద చర్య అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత దేశ ప్రభుత్వం ఇప్పటికే పాకిస్తాన్ ఉగ్రవాదులకు బుద్ధి చెప్పిందని, భారత దేశ ఆర్మీకి ప్రజలు అండగా ఉంటారని స్పష్టం చేశారు.

వైదిక ఆశ్రమంలో ముగిసిన శిక్షణ తరగతులు



నేర్చుకున్న విద్యలను రాయపూడి వైదిక ఆశ్రమంలో ప్రదర్శిస్తున్న బాలలు

తుళ్లూరు, (రాయపూడి), మే 11(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రాయపూడి వైదిక ఆశ్రమంలో 15 రోజుల పాటు నిర్వహించిన బాల బాలికలకు శారీరక, నైతిక శిక్షణశిబిరం ఆదివారంతో ముగిసింది. బాల బాలికలు నేర్చుకున్న ఆసనాలు, కరాటే, జూడో వంటి విద్యలు ప్రదర్శించారు. దేశ భక్తి దైవ భక్తిగీతాలను ఆలపించారు. సూర్యనమస్కారాలు చేసి ప్రేక్షకులను అబ్బురపరచారు. ఉదయం యాగం నిర్వహించి ముగింపు ఉత్సవం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఆర్యవీర్ దళ్ సభ్యులు హాజరైయ్యారు. కార్యక్రమంలో సభ్యులు సదాశివరావ్, భాస్కరరావు, రమాదేవీ, లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈమనిలో భగవద్గీతపై ప్రచారం



ఈమనిలో భగవద్గీతపై ప్రచారంలో పాల్గొన్న గుంటూరు త్రైత సిద్ధాంత ప్రబోధసేవాసమితి జ్ఞానవేదిక ప్రతినిధులు

దుగ్గిరాల, మే 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు త్రైతసిద్ధాంత ప్రబోధసేవా సమితి జ్ఞానవేదిక ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలం ఈమనిలో భగవద్గీతపై ప్రచారం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. శ్రీకృష్ణుని విశ్వసిస్తే పౌర్ణమి వైపు నడిచి జ్ఞానం తెలుసుకుని మోక్షం లభిస్తుందని, అమావాస్య వైపు నడిచి వెళ్లి అజ్ఞానంలోకి వెళ్లొద్దని తెలియజేశారు. రౌతు శ్రీనివాసరావు, టీవీ కృష్ణారావు, ఆర్ రామకృష్ణ, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

వృద్ధుడిపై దాడి

తెనాలి, మారీసుపేట,మే 11 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడిపై దాడిచేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఆదివారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక అమరావతి ప్లాట్స్‌కు చెందిన చుక్కపల్లి నాగేశ్వరావు తన ఇంటి పక్కన నూతనంగా భవనం నిర్మిస్తున్న సుధాకర్‌ను తమ ఇంటిలోకి సిమెంట్, ఇసుక పడుతుందని పడకుండా పనిచేసుకోవాలన్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో నాగేశ్వరావుపై సుధాకర్ దాడిచేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

భర్త మృతిపై ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట,మే 11 (ఆంధ్రజ్యోతి): భర్త మృతిపై భార్య చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రజకపేటకు చెందిన ఉప్పలపాటి రజనికి తెనాలి పట్టణానికి చెందిన ఉప్పలపాటి హరిప్రసాద్‌తో ఎనిమిది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక బాబు ఉన్నాడు. హరిప్రసాద్ పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అయితే హరిప్రసాద్‌కు వివాహానికి ముందే అనారోగ్య సమస్యలు ఉన్నాయి. విపరీతమైన తలనొప్పితో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో అనారోగ్య సమస్యలతో ఈ నెల 7న ఉదయం కూల్ డ్రింక్‌లో ఎలుక మందు పేస్ట్‌ను కలుపుకొని తాగాడు. సాయంత్రం బాధను భరించలేక తాను తాగిన విషయం భార్య రజనికి తెలపగా బంధువుల సాయంతో జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. శుక్రవారం రాత్రి హరిప్రసాద్ గుండెపోటుతో మృతి చెందాడని వైద్యులు తెలిపారు. బాధితురాలు రజని భర్త మృతిపై ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి: జ్ఞానశేఖర్

తెనాలి అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర మండలం క్రిస్టియన్‌పాలెంలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలి రావాలని జ్ఞానశేఖర్ కోరారు. విగ్రహ ఆవిష్కరణ కరపత్రాలను ఆదివారం తెనాలిలో ఆవిష్కరించారు. జూన్ 7న విగ్రహాన్ని అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపకులు వీవీ సునీల్‌కుమార్ ఆవిష్కరిస్తారని చెప్పారు. మోహన్, సల్మాన్‌రాజు, భూషణం, నాగేశ్వరరావు, జేమ్స్, అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

మారీసుపేట (తెనాలి), మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రంలో మజ్జిగను పంపిణీ చేశారు. ఆదివారం అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు కన్నెగంటి మురళీకృష్ణ కుమారుడు వైభవ్‌కృష్ణ జన్మదినోత్సవం సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, జొన్నకూటి శ్రీకాంత్, వైష్ణవి దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా వారి కుమార్తె శ్వాస, కుటుంబ సభ్యులు మరియు మునిపల్లి జ్ఞానేశ్వర్ జన్మదినం సందర్భంగా తల్లిదండ్రులు వెంకట రఘునాధరావు, రుద్రాణి కుటుంబ సభ్యుల సహకారంతో పాదచారులకు చల్లని మజ్జిగ, తాగునీరును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు డి.రాంబాబు, శ్రీనివాసరావు, ప్రతాప్, వాసు, ప్రదీప్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మాతృమూర్తిది ప్రధాన భూమిక

● జోసఫ్ మోసిగంటి

పొన్నూరు టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో మాతృమూర్తిది ప్రధాన భూమిక అని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ జోసఫ్ మోసిగంటి ఆదివారం అన్నారు. ఒకతల్లి సమర్ధురాలు అయితే భావితరాలు సమర్థులుగా ఉంటారన్నారు. అందుకనే మహిళలు విద్యనభ్యసించడంతో పాటు జ్ఞానం సంపాదించుకోవాలని సూచించారు. మహిళల గొప్పతనాన్ని గుర్తించి ప్రభుత్వాలు మహిళలకు తగిన గుర్తింపునివ్వాలని కోరారు.

మదర్స్ డే వేడుకలు

తెనాలి అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థన కొండ చర్చిలో ఆదివారం మదర్స్ డే వేడుకలు నిర్వహించారు. మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి కుటుంబంలో తల్లి పాత్రను వివరించారు. రత్నకుమారి, అలేఖ్య, అమూల్య, నిర్మల పాల్గొన్నారు.

వైభవంగా శ్రీగంగానమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠ

కొల్లిపర, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హనుమాన్‌పాలెంలో ఆదివారం శ్రీగంగానమ్మ, పోతురాజు స్వామి విగ్రహాల పునః ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచి ఆలయం ఎదుట పండితులు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీగంగానమ్మ, శ్రీపోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి మండలంలోని గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత పండితులు శ్రీగంగానమ్మ, శ్రీపోతురాజుస్వామి విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించడంతో మహిళలు హారతులు ఇచ్చారు. ప్రతిష్ఠ మహోత్సవంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మొవ్వా వెంకయ్య, అడపా నారాయణరెడ్డి, కన్నెగంటి శ్రీను, మొవ్వా రాజా, అవుల వెంకట్రావు, పాలడుగు సుబ్బారావు, మొవ్వా పాపారావు తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో చురుగ్గా ఆక్రమణల తొలగింపు

● ఆక్రమణల తొలగింపుతో విశాలంగా రహదారులు
● వేగంగా అభివృద్ధి పనులు
● సువిశాలంగా బుర్రిపాలెం మార్గం
● ఈ మార్గంలో తగ్గిన ట్రాఫిక్ ఇక్కట్లు



చెంచుపేటలో ఆక్రమణలు తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

తెనాలి అర్బన్, మారీస్‌పేట, మే 11 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలో చురుగ్గా ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. దీంతో ఇరుకుగా ఉన్న రహదారులు విశాలంగా కనిపిస్తున్నాయి. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో బుర్రిపాలెం రోడ్డులో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిన నిర్మాణాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. తెనాలి పట్టణంలో గుండా బుర్రిపాలెం, చక్రాయపాలెం, అనంతవరం, లంక గ్రామాలకు వెళ్లేందుకు ప్రధానమైన ఈ మార్గం ఆక్రమణలు, నిర్మాణాలతో ఇరుకుగా మారింది. పట్టణంలో నానాటికి పెరుగుతున్న జనాభా కారణంగా కూడా బుర్రిపాలెం రోడ్డులో కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ రాకపోకలకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పట్టణం వెలుపల ఉన్న డాల్‌మిల్‌లకు భారీ లారీలు వస్తుంటాయి. దీంతో పాటు ఈ మార్గమే ఆర్టీసీ బస్సులకు ప్రధానం. అయితే రైతు బజారు, పాత రత్నటాకీసు వద్ద నిర్మాణాల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే శివాజీ చౌక్‌లో ఉన్న యడ్లపాటి వెంకట్రావు ద్వారాన్ని తొలగించి అక్కడ నుంచి పాత రత్నా టాకీసు వరకు ఇరువైపులా ఆక్రమణలన్నీ తీసివేసి రహదారి విశాలం చేశారు. పాత రత్న టాకీసు ముందు ఉన్న పురాతన భవనాన్ని, రైతు బజారు ముందు కాలం తీరిన మున్సిపల్ దుకాణ సముదాయాన్ని తొలగించడంతో ఈ మార్గం విశాలంగా మారింది. ఇక్కడ నుంచి బుర్రిపాలెం చివరి వరకు మరికొన్ని ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఉంది. పట్టణాన్ని మంత్రి పరిశీలిస్తూ ఎక్కడ ఏ సమస్య ఉందో గుర్తించి ఎవరికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుని పట్టణ వనరులను మెరుగైన రీతిలో తీర్చిదిద్దడంపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. బోసురోడ్డులో కూడా టౌన్ చర్చి నుంచి స్వరాజ్ థియేటర్ వరకు ఆక్రమణలను తొలగించి రహదారిని విస్తృత పరిచారు. దీంతో పట్టణానికి ప్రధానమైన ఈ రెండు ప్రాంతాలు విశాలమై ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోయాయి. గాంధీచౌక్ వద్ద నాలుగు రోడ్లు కూడా తగినంత వెడల్పు లేకపోవడం, దుకాణాల ముందు ద్విచక్ర వాహనాలు నిలిపి ఉంచడం, తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ రోడ్లపై కూడా దృష్టి సారించి ట్రాఫిక్ సమస్యను నివారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పట్టణ అభివృద్ధికి ప్రణాళికలు

తెనాలిలో చిన్నరోడ్లు, పెరిగిన ట్రాఫిక్‌తో తెనాలి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్లు మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయకపోవడంతో సమస్య జటిలంగా మారింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో తెనాలి ప్రాంతం అభివృద్ధికి నోచుకోక పోగా మరింత అధ్వానంగా తయారైందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలిని అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా ప్రధాన రహదారుల వెంట ఏళ్ల తరబడి ఆక్రమణలకు గురైన డ్రెయిన్లపై దృష్టిపెట్టి వాటిపై ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు చేపట్టారు. దీనితోపాటు డ్రెయిన్లలో ఉన్న వ్యర్థాలను సైతం తొలగించుకుంటూ పారిశుధ్య పనులను మెరుగుపరుస్తున్నారు. పట్టణంలో పలుప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించి నూతన డ్రెయిన్లు రోడ్ల విస్తరణలు చేపట్టారు. ఏళ్ల తరబడి నెలకున్న ట్రాఫిక్ సమస్యకు రోడ్ల విస్తరణతో పరిష్కారమవుతోంది. పట్టణ పరిసర గ్రామాల్లో పెరిగిన జనాభాలకు అనుగుణంగా ఏపీఎస్ ఆర్టీసీలో కూడా నూతన బస్సులను ప్రవేశపెట్టి మారుమూల ప్రాంతాలకు కూడా బస్సు సర్వీసులను అందేబాటులోకి తెచ్చారు. రానున్న రోజుల్లో తెనాలిని కూడా అభివృద్ధి చెందిన పట్టణాలకు దీటుగా తీర్చిదిద్దేలా పనులు వేగవంతం చేశారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



డివైడర్‌కు రెండు వైపులా నిర్మాణాలను తొలగించడంతో విశాలంగా మారిన బుర్రిపాలెం వెళ్లే రహదారి

నయనానందకరంగా భావదేవుడి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీసాక్షిభావన్నారాయణస్వామి

పొన్నూరు టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో పురాణ ప్రసిద్ధి చెందిన శ్రీసుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత సాక్షిభావన్నారాయణస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం నయనానందకరంగా సాగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివార్ల ఉత్సవమూర్తులకు చందనోత్సవం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. రాత్రికి గజవాహనంపై ఉభయ దేవేరులతో కలిసి పట్టణ వీధుల్లో భావన్నారాయణ స్వామి విహరించారు. అనంతరం ఎదురుకోలోత్సవం జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్త రాజావాసిరెడ్డి సుధాస్వరూప్‌బహద్దూర్ మన్నే సుల్తాన్‌దొర ఆధ్వర్యంలో స్వామి వారికి తలంబ్రాలు సమర్పించారు. అలాగే నిడుబ్రోలు వాస్తవ్యులు చింతక్రింది సోదరులు స్వామి వారికి తలంబ్రాలు సమర్పించి ఆలయ మర్యాదలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సర్వాంగసుందరంగా అలంకరించిన వేదికపై స్వామివార్ల ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించిన అర్చక స్వాములు వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ కల్యాణ క్రతువు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. దీనిలో భాగంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సోమవారం గరుడోత్సవం, దివ్యరథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి.

నందివెలుగు బ్రిడ్జిపై

స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించండి

● చిరు వ్యాపారులతో రూరల్ ఎస్ఐ ఆనంద్



వ్యాపారులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ ఆనంద్

తెనాలి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే నందివెలుగు బ్రిడ్జి చుట్టూ ఆక్రమించుకుని వ్యాపారులు నిర్వహించే నిర్వాహకులు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని రూరల్ ఎస్ఐ కట్టా ఆనంద్ సూచించారు. ఆదివారం మండలంలోని నందివెలుగు కూడలిలో బ్రిడ్జ్ చుట్టూ ఆక్రమించుకుని ట్రాఫిక్‌కు, పాదచారులకు ఇబ్బందిగా ఉంటూ వ్యాపారాలు నిర్వహిస్తున్న పలువురు నిర్వాహకులతో ఎస్ఐ ఆనంద్ పలు సూచనలు చేశారు. వేలాది వాహనాలు రాకపోకలు చేసే క్రమంలో ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడుతుందన్నారు. గతంలో ఇదే కూడలి వద్ద అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని వాటి నియంత్రణకు అవసరమైన సురక్షిత చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా రోడ్ల వెంబడి ఆక్రమించి చేస్తున్న వ్యాపారులు స్వచ్ఛందంగా ఖాళీ చేయడం ద్వారా రాకపోకలు చేసే వాహనాలు నలిచిపోవటానికి అవకాశం ఉండదన్నారు. పోలీసులకు సహకరించాలని కోరారు. రూరల్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ వెంకటేష్‌ను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

మధుమేహ వ్యాధిగ్రస్థులు అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ వెంకటేష్

తెనాలి అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): మధుమేహ వ్యాధిగ్రస్థులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వెంకటేష్ చెప్పారు. గాంధీనగర్‌లోని కవిరాజా పార్కులో ఆదివారం వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాలడుగు ఆనందయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మధుమేహ వ్యాధివలన వచ్చే దీర్ఘకాల వ్యాధులను అరికట్టడం ఎలా అనే అంశంపై ఆయన ప్రసంగించారు. దీర్ఘకాలంగా టైప్-2 మధుమేహంతో బాధపడే వారిపై ప్రభావం చూపుతుందని, తరచూ పరీక్షలు చేయించుకుంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాయామం చేయాలని, తద్వారా సమస్య అదుపులో ఉంటుందన్నారు. కార్యదర్శి వీరబాబు, రత్తయ్య, అశోక్, మొవ్వా సత్యనారాయణ, రంగారావు, శంకర్, ఆదినారాయణ పాల్గొన్నారు.

లేత జొన్నపై అప్రమత్తత అవసరం

● తిన్న గంటలో ప్రాణాపాయం ● హైపో ద్రావణంతో చికిత్స
● పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి



తెనాలి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): లేత జొన్నపై అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి సూచించారు. రబీ సీజన్‌లో ఎక్కువగా రైతులు జొన్న పంటలను సాగుచేస్తుంటారు. సాగు పూర్తయిన తరువాత కంకులను కోసి పైర్లను వదిలేస్తారు. ఆ భూముల్లో వేసవి జల్లులు కురవడంతో తిరిగి భూమి నుంచి జొన్న చిగుళ్లు వస్తాయి. అవి పచ్చగా ఉండటంతో వాటిని పశువులు తింటుంటాయి. ఈ మొక్కల్లో ప్రమాదకరమైన హైడ్రోజన్ సైనైడ్‌ను కలిగి ఉంటాయి. వీటిని పశువులు తిన్న 15 నుంచి 20 నిముషాల్లోనే ప్రాణాపాయ స్థితికి చేరుకుంటాయి. శ్వాస తీసుకునేందుకు కష్టంగా ఉండటం, నోటి నుంచి నురుగ రావడం, అస్థిరంగా ఉండటం వంటి లక్షణాలను గమనిస్తే సోడియం థియోసల్ఫేట్ (హెచ్‌వైపీవో)మందును పశువులకు ప్రతి గంటకు 50గ్రాముల చొప్పున అందిస్తే అవితిరిగి కోలుకునే అవకాశం ఉంటుందని డాక్టర్ నాగిరెడ్డి తెలిపారు. వేసవి కావడంతో తప్పనిసరిగా పశుపోషకులు ఈ మందుకు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పశువులను ఉదయం పూట ఎట్టిపరిస్థితిలో మేత మేపేందుకు తీసుకువెళ్లకుండా ఉండాలన్నారు. ఆ సమయంలో ఉదయించే సూర్యరశ్మికి అవి వడబడిపోయి మరింతగా విషపూరితంగా మారే ప్రమాదం ఉంటుందన్నారు. జొన్నసాగు పూర్తి చేసుకున్న రైతులు సైతం పంటభూములను ఖాళీగా వదిలేయకుండా దుక్కులు దున్నివేయాలని సూచించారు.



లేతజొన్న తిని చనిపోయిన పశువులను పరిశీలిస్తున్న డాక్టర్ నాగిరెడ్డి

వృద్ధాశ్రమంలో అన్నదానం



ఆశ్రమంలోని మాతృమూర్తులకు పాద పూజ చేస్తున్న ఎస్వీ యోగా సభ్యుడు రమణయ్య తదితరులు

తెనాలి, మారీసుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మాతృమూర్తి దినోత్సవం సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని శ్రీవెంకటేశ్వర యోగ సేవ కేంద్రం సభ్యులు నిర్వహించారు. ఆదివారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీమహాత్మాగాంధీ శాంతి వృద్ధాశ్రమంలో మాతృదినోత్సవం సందర్భంగా ఎస్వీ యోగా సభ్యులు ముద్దాభక్తుని అమ్మకమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ముద్దాభక్తుని రమణయ్య, కుటుంబ సభ్యులు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ సీనియర్ నేత అడపా సంపత్‌రాయుడు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సావిత్రి, అనూష, జగదీశ్వరి, ఉమామహేశ్వరి, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వె.కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



పద సంచలనంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

ఆర్ఎస్ఎస్ కార్యకర్తల పద సంచలనం

తెనాలి అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తల పద సంచలనం ఆదివారం పట్టణంలో నిర్వహించారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆర్ఎస్ఎస్ ప్రదర్శన చేశారు. నూతక్కిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రథమ వర్ష శిక్షావర్గలో శిక్షణ పొందుతున్న కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. యువతలో దేశ భక్తిని పెంపొందించేందుకు ఆర్ఎస్ఎస్ తమవంతు పాత్ర పోషిస్తుందని తెనాలి ప్రాంత ప్రతినిధులు అంబటి మారుతీరామ్ పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ప్రదర్శించిన అనంతరం పట్టణంలో గాంధీచౌక్, పాత శివాలయం, నెహ్రూరోడ్డు, శివాజీచౌక్ తదితర ప్రాంతాల్లో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని పొత్తూరి ఆదిశేషయ్య, పరిపూర్ణ ప్రసాద్, మనోహర్, సుధాకర్ తదితరులు పర్యవేక్షించారు.

పేరంటాళ్లమ్మను దర్శించుకున్న మంత్రి మనోహర్



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి మనోహర్, నన్నపనేని రాజకుమారి, ముకుందరావు దంపతులు

తెనాలి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐతానగర్‌లోని వెంకయ్య-గౌరమ్మ పేరంటాలమ్మ తల్లి దేవాలయాన్ని మంత్రి మనోహర్ సందర్శించి స్వామి వార్లను దర్శించుకున్నారు. అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మంత్రి మనోహర్ ఆలయానికి విచ్చేసి స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత ఆలయానికి విచ్చేసిన మంత్రి మనోహర్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి స్వామి వార్ల దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. మాజీ మహిళా చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ముకుందరావు దంపతులు ఆలయాన్ని సందర్శించి స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దావులూరిపాలెంలో శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులుగా ఆలయం ఎదుట పండితులు పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంతగాని రవిశ్రీను, అడపా నారాయణరెడ్డి, తోటా రామసుబ్బారావు, పసుపులేటి రాజేష్, తోటా గోపి, కట్టా శ్రీహరిరెడ్డి, తోటా రాంబాబు, పెరికల రాంబాబు, బాజీ, మండూరు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సాహిత్యరత్న అవార్డు అందుకుంటున్న సుబ్రహ్మణ్యం

సుబ్రహ్మణ్యంకు సాహిత్యరత్న అవార్డు

పొన్నూరు టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు మండే సుబ్రహ్మణ్యంకు సాహిత్యరత్న అవార్డు లభించింది. ఆదివారం ఏలూరు శ్రీశ్రీ కళావేదిక ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు, కవి మండే సుబ్రహ్మణ్యం పాలుపంచుకున్నాడు. ప్రపంచ తెలుగుసాహిత్య సంబరాల పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా సుబ్రహ్మణ్యం మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని చేసిన స్వీయరచన గానం, అమ్మప్రేమ ఉత్తమ ప్రశంసలు అందుకుంది. సుబ్రహ్మణ్యంను కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ ఈశ్వరిభూషణం తదితరులు సాహిత్యరత్న అవార్డు అందజేసి అభినందించారు.